


Truth of News

# సూర్య వాస్తవం

PRGI Reg No: APTEL/26/A4781

http://www.suryavastavam.in

చీఫ్ ఎడిటర్: మొఘల్ ఇర్షాద్ బేగ్

IRS PUBLICATIONS
irspublications12@gmail.com

అన్నమయ్య జిల్లా | సంపుటి: 02 | సంచిక : 14 | శుక్రవారం 21 ఆగస్టు 2026 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi


## మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీకి
# రాహుల్‌గాంధీ నివాళి

- నవంబర్‌లో సోనియాగాంధీ ఆత్మకథ
- మార్కెట్‌లోకి రానున్న 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' పుస్తకం



న్యూఢిల్లీ– సూర్య వాస్తవం

'అమ్మను గర్వంగా చూస్తున్న నాన్న', 'తల్లీ నీ కష్టాలు నాకు, నా చెల్లెలు ప్రియాంకకే తెలుసు' అని తన మాతృమూర్తి సోనియాగాంధీ ఆత్మకథపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ అన్నారు. గు రువారం మాజీ ప్రధాని

- మిగతా 2లో..

## మోదీ, అమిత్ షాల
# రాజకీయ అధ్యాయం ముగిసింది

- ఎన్డీయేలో బీజేపీ ఆధిపత్యం క్షీణించిందన్న రాహుల్‌గాంధీ
- మోదీ, అమిత్ షా రాజకీయ ఆధిపత్యం తగ్గిందని వ్యాఖ్య
- కాంగ్రెస్, ఇండియా కూటమి వ్యూహాత్మకంగా ముందుకు సాగుతోందని వెల్లడి



న్యూఢిల్లీ – సూర్య వాస్తవం

లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాలపై మరోసారి విమర్శలు గుప్పించారు. ఎన్డీయేలో బీజేపీ రాజకీయ ఆధిపత్యం క్షీణించిందని... మోదీ, అమిత్ షా రాజకీయ ప్రయాణం ముగిసిపోయిందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ సమావేశంలో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. కేంద్రంలో బీజేపీకి స్వతంత్రంగా మెజారిటీ లేకపోవడం వల్ల

- మిగతా 3లో..



## ఢిల్లీలో విద్యార్థులపై దాడి విచారణకు
# సుప్రీం కమిటీ

- ఐదుగురు సభ్యులతో స్వతంత్ర బృందం ఏర్పాటు

న్యూఢిల్లీ – సూర్య వాస్తవం

ఢిల్లీలోని సీజేపీ ఆధ్వర్యంలో గత నెల 20న జరిగిన పార్లమెంట్ మార్చ్ లో విద్యార్థులపై పోలీసులు, భద్రతా దళాలు జరిపిన దమన కాండపై సుప్రీంకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. దీనిపై విచారించేందుకు ఐదుగురు సభ్యులతో కూడిన స్వతంత్ర కమిటీని సుప్రీంకోర్టు ఏర్పాటు చేసింది. ఈ కమిటీకి సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి

- మిగతా 2లో..

## డీలిమిటేషన్‌తో
# అన్యాయం చేయొద్దు

- పార్లమెంటులో రాజకీయ ప్రాతినిధ్యాన్ని కాపాడండి
- చట్టసభల్లో స్థానాలు పెంచకుండానే మహిళా రిజర్వేషన్లు దక్షిణ ప్రాంతీయ మండలి
- సమావేశంలో ముఖ్యమంత్రుల సూచన



చెన్నై – సూర్య వాస్తవం

తమిళనాడులో కేంద్ర హోం మంత్రి అమిత్ షా అధ్యక్ష?తన గురువారం జరిగిన సదరన్ జోనల్ కౌన్సిల్ (దక్షిణ ప్రాంతీయ మండలి) సమావేశంలో నియోజక వర్గాల పునర్విభజన, దక్షిణాది రాష్ట్రాల రాజకీయ ప్రాతినిధ్య పరిరక్షణ, నీట్ పరీక్ష, కావేరీ జలాల పంపిణీ, అధిక ఆర్థిక స్వయం ప్రతిపత్తి వంటి పలు కీలక అంశాలు ప్రస్తావనకు వచ్చాయి. పార్లమెంటులో దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యాన్ని కాపాడేందుకు ఓ అధికారిక తీర్మానం చేయాలని కర్నాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ కోరగా ప్రతిపాదిత నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ కారణంగా తమ ప్రాంత రాజకీయ ప్రాతినిధ్యం తగ్గకుండా చూడాలని తమిళనాడు ముఖ్యమంత్రి జోసఫ్ విజయ్

- మిగతా 2లో..



## కుప్పకూలిన
# బంగారు గని

- 30 మంది కార్మికులు మృతి
- శిథిలాల కింద చిక్కుకుపోయిన మరికొందరు
- మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం
- నానా-మాంబెరే ప్రావిన్స్ పరిధిలోని అబ్బా ప్రాంతంలో ఘటన

అబ్బా– సూర్య వాస్తవం

సెంట్రల్ ఆఫ్రికన్ రిపబ్లిక్ దేశంలో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. పశ్చిమ ప్రాంతంలో గల నానా–మాంబెరే ప్రావిన్స్ పరిధిలోని అబ్బా ప్రాంతంలో మంగళవారం ఓ బంగారు గని కుప్పకూలింది. ఈ ఘటనలో 30 మంది కార్మికులు ప్రాణాలు కోల్పోయారు.

- మిగతా 2లో..

## ప్రమాదాలు జరగకుండా
# పటిష్ఠమైన ఎస్‌వోపీ అమలు చేయాలి

- అధికారులకు సీఎం చంద్రబాబు ఆదేశం
- కోనసీమ మత్స్యకారుల గల్లంతుపై సీఎం ఉన్నతస్థాయి సమీక్ష
- మత్స్యకారుడు అప్పన్న కోసం గాలింపు ముమ్మరం చేయాలన్న హోంమంత్రి అనిత
- కోస్ట్ గార్డ్, మెరైన్ పోలీసుల ఆధ్వర్యంలో కొనసాగుతున్న విస్తృత గాలింపు చర్యలు
- బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని ప్రభుత్వ భరోసా



అమరావతి– సూర్య వాస్తవం

బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాకు చెందిన ఏడుగురు మత్స్యకారుల గల్లంతు ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రంగా స్పందించారు. ప్రమాదాలు జరిగిన తర్వాత స్పందించడం కాదని, భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా పటిష్ఠమైన

- మిగతా 2లో..

- డీఎస్సీపై సీబీఐ విచారణకు మీరు సిద్ధమా?
- చంద్రబాబుకు జగన్ సవాల్
- లోకేశ్‌ను కాపాడేందుకే గ్రూప్-1పై తప్పుడు ప్రచారమన్న జగన్
- గ్రూప్-1 నోటిఫికేషన్ విడుదల, ప్రిలిమ్స్ టీడీపీ హయాంలోనే జరిగాయని వెల్లడి
- హైకోర్టు ఆదేశాలతోనే మాన్యువల్ మూల్యాంకనం చేశామని స్పష్టీకరణ
- హాయ్‌ల్యాండ్‌లో మూల్యాంకనం జరగలేదని, సిట్ దర్యాప్తుపై విమర్శలు

## గ్రూప్-1పై విచారణకు
# మేము రెడీ..

అమరావతి– సూర్య వాస్తవం

ఏపీ సీఎం చంద్రబాబుపై మాజీ ముఖ్యమంత్రి జగన్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. డీఎస్సీ అక్రమాల నుంచి కుమారుడు నారా లోకేశ్‌ను కాపాడుకునేందుకే, ఏపీపీఎస్సీ గ్రూప్–1 పోస్టుల భర్తీపై చంద్రబాబు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని జగన్ ధ్వజమెత్తారు. గ్రూప్–1 వ్యవహారంపై సీబీఐ విచారణకు తాము సిద్ధంగా ఉన్నామని, డీఎస్సీ కుంభకోణంపై సీబీఐ విచారణకు చంద్రబాబు సిద్ధమా? అంటూ సవాల్ విసిరారు. డీఎస్సీపై దర్యాప్తు



చేయాలని ఇప్పటికే కేంద్రాన్ని కోరినట్లు ఆయన తెలిపారు.

- మిగతా 2లో..


సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి




- మంత్రి నారా లోకేశ్ మాజీ సీఎం జగన్‌పై మంత్రి నారా లోకేశ్ తీవ్ర విమర్శలు
- ఏపీపీఎస్సీ, డీఎస్సీకి తేడా తెలియదంటూ ఎద్దేవా
- గత ఐదేళ్లలో ఒక్క డీఎస్సీ వేయకపోవడానికి ఇదే కారణమన్న లోకేశ్
- అసెంబ్లీ చర్చ నుంచి జగన్ పారిపోతున్నారని ఆరోపణ
- సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న లోకేశ్ పోస్ట్

## జగన్‌కు ఏపీపీఎస్సీ,
# డీఎస్సీకి తేడా తెలియదు

అమరావతి– సూర్య వాస్తవం

మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత జగన్ పై రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. జగన్‌కు ఏపీపీఎస్సీ, డీఎస్సీల మధ్య గల వ్యత్యాసం కూడా తెలియదని, ఆ అజ్ఞానం వల్లే గత ప్రభుత్వ హయాంలో నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆరోపించారు. ఈ మేరకు జగన్ పాత ప్రెస్ మీట్ వీడియోను లోకేశ్ గురువారం 'ఎక్స్' వేదికగా పోస్ట్ చేశారు. "ఏపీపీఎస్సీ

- మిగతా 2లో..

# మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీకి రాహుల్‌గాంధీ నివాళి

(మొదటిపేజీ తరువాయి)

రాజీవ్ గాంధీ 82వ జయంతి సందర్భంగా ఆయనకు రాహుల్‌గాంధీ నివాళి అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నవంబర్ 10న విడుదల కానున్న తన తల్లి ఆత్మకథ 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్'ను 'త్వరలోనే ఆమెను ప్రేమించే లక్షలాది మంది చదువుతారని' తాను గర్వపడుతున్నానని పేర్కొన్నారు. ఆమెలాంటి గోప్యత పాటించే వ్యక్తికి తన అంద మైన కథను ప్రపంచానికి చెప్పడం ఎంత కష్టమో తనకే తెలుసని అన్నారు. సోనియాగాంధీ నవంబర్‌లోతన ఆత్మకథను విడు దల చేయనున్నారు.

'బహిరంగ రాజకీయ ప్రపంచంలోకి' అడుగుపెట్టిన విషాదం, 2004లో ప్రధానమంత్రి పదవిని తిరస్కరించడం వంటి తన వ్యక్తిగత కథను పంచుకో నున్నారు. 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' పుస్తకం నవంబర్ 10న మార్కెట్లోకి రానుందని, పెంగ్విన్ రాండమ్ హౌస్ అమెరికన్ అనుబంధ సంస్థ అయిన ఆల్ఫ్రెడ్ ఎ నాఫ్ మంగళవారం ప్రకటించింది. అయితే, భారతదేశంలో ఈ పుస్తకం విడుదల తేదీని పెంగ్విన్ రాండమ్ హౌస్ ఇండియా ఇంకా ధ్రువీకరించలేదు. రాహుల్ గాంధీ తన ఎక్స్ లో కూడా ఇలా పోస్ట్ చేశారు. 'అమ్మా, నేను మిమ్మల్ని, నాన్నను కలిసి చివరిసారిగా 35 సంవత్సరాల క్రితం చూశాను. 1991లో నా న్న మమ్మల్ని విడిచి వెళ్లిన రోజు నుంచి, జీవితం మీపై విసిరిన ప్రతీ సవాల్‌ను మీరు అంతులేని ధైర్యంతో, గౌరవంతో ఎదుర్కోవ డం చూశాను' అని పేర్కొన్నారు. 'మీరు ఏమి అనుభవించారో, నాన్న తర్వాత మీ జీవితం నిజంగా ఎంత కష్టంగా గడిచిందో ప్రియాంకకు, నాకు మాత్రమే నిజంగా తెలు సు' అని తెలిపారు. 'మీ కథ --'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' -- చివరకు మిమ్మల్ని ప్రేమించే లక్షలాది మంది ప్రజలచే చదవబడుతున్నం దుకు నేను సంతోషంగా, చాలా గర్వంగా ఉన్నాను. మీలాంటి గోప్యత పాటించే వ్యక్తికి మీ అందమైన కథను ప్రపంచా నికి చెప్పడం ఎంత కష్టమో నాకు తెలుసు' అని ఆయన అన్నారు.

గురువారం రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా రాహుల్ గాంధీ మాట్లాడుతూ, 'నాన్న తన అందమైన సోనియా వైపు గర్వంగా చూస్తూ నవ్వుతున్నట్లు నాకు కనిపిస్తోంది' అని అన్నారు. సోనియా తన జీవిత ప్రయాణంపై రాసిన ఆత్మకథను నాఫ్ ప్రచురణ సంస్థ నవంబరు 10న హార్డ్ కవర్, ఈ-బుక్ రూపంలో విడుదల చేయనుంది. దీని ఆడియో ఎడిషన్‌ను పెంగ్విన్ రాండమ్ హౌస్ అందుబాటులోకి తీసుకురానుంది. తొలి ముద్రణలో లక్ష కాపీలను ముద్రించనున్నట్లు ప్రచురణకర్త తెలిపారు. మరోవైపు తన జీవితంలో జరిగిన కీలక ఘట్టాలు, విషయాలను పుస్తకంలో పంచుకున్నట్లు సోనియా తెలిపారు. ఇందులో రాజీవ్ గాంధీతో ప్రేమ, పెళ్లి వంటి విషయాలను పేర్కొన్నట్లు వెల్లడించారు. రాజకీయాల్లోకి రావడం, అందుకు దారితీసిన పరిస్థితులను పంచుకున్నట్లు ఆమె వివరించారు. తన కుటుంబం గురించే ఎక్కువగా ప్రస్తావించినట్లు తెలిపారు. రాహుల్‌గాంధీ సోదరి, కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ కూడా తన తండ్రి రాజీవ్ గాంధీకి నివాళులర్పించారు. తన కథను 'ఎంతో హృదయపూర్వకంగా, నిజాయితీగా' రాసినందుకు తన భార్యను చూసి రాజీవ్‌గాంధీ గర్వపడి ఉండేవారని ఆమె 'ఎక్స్'లో పేర్కొన్నారు.

# మోదీ, అమిత్ షాల రాజకీయ అధ్యాయం ముగిసింది

(మొదటిపేజీ తరువాయి)

ఆ పార్టీ రాజకీయ శక్తి, పట్టు పూర్తిగా తగ్గిపోయాయని ఆయన విమర్శించారు. గతంలో చూపిన రాజకీయ ఆధిపత్యాన్ని మోదీ, అమిత్ షా జోడీ ఇప్పుడు కోల్పోయిందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ప్రతిపక్షంగా కాంగ్రెస్ పార్టీ, 'ఇండియా' కూటమి మరింత వ్యూహాత్మకంగా ముందుకు సాగుతోందని వెల్లడించారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ప్రజల సమస్యలపై పోరాటాన్ని మరింత తీవ్రతరం చేయాలని, రాబోయే సవాళ్లను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.

### ఢిల్లీలో విద్యార్థులపై దాడి విచారణకు

# సుప్రీం కమిటీ

(మొదటిపేజీ తరువాయి)

జస్టిస్ ఆర్ సుభాశ్ రెడ్డి అధ్యక్షత వహించగా, పంజాబ్-హర్యానా హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రవి శంకర్ ఝా, ఢిల్లీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ షాలిందర్ కౌర్, సీబీఐ మాజీ డైరెక్టర్ రిషి కుమార్ శుక్లా, మేఘాలయ రిటైర్డ్ డీజీపీ ఎల్‌ఆర్ బిష్ణోయ్ సభ్యులుగా ఉంటారు. విద్యార్థుల నిరసన సందర్భంగా వారిపై జరిగిన లాఠీఛార్జి, ఎలక్ట్రిక్ బ్యాటన్ల ప్రయోగం, పెల్లెట్ల వినియోగం, టియర్ గ్యాస్ ప్రయోగం వంటి అంశాలపై ఈ కమిటీ విచారణ జరుపుతుంది. సరైన హెచ్చరికలు లేకుండానే విద్యార్థులపై వీటిని ప్రయోగించినట్టు ఆరోపణలున్నాయి. ఇదే సమయంలో నిఘా పేరుతో విద్యార్థుల గోప్యతకు భంగం కలిగిందా లేదా అనే విషయాన్ని కూడా కమిటీ పరిశీలిస్తుంది.

అలాగే, నిరసన సందర్భంగా జరిగిన హింస, దాడులు, వేధింపులు, లైంగికపరమైన దాడులపై కూడా కమిటీ విచారణ జరుపుతుంది. గాయపడిన వారికి సరైన వైద్యం అందించారా? ఆర్థిక సాయం ఏమైనా చేశారా? అనే అంశాలపై కూడా ఆరా తీస్తుంది. అదే సమయంలో పోలీసులు, ఇతర భద్రతా బలగాలపైకి నిరసనకారులు, అసాంఘిక శక్తులు జరిపిన దాడి అంశంపై కూడా కమిటీ విచారణ జరుపుతుంది. నిరసన సందర్భంగా జరిగిన హింస, ఘర్షణలో జరిగిన పబ్లిక్, ప్రయివేటు ఆస్తుల వివరాల సేకరణ, దాడుల్లో గాయపడ్డ భద్రతా సిబ్బందికి అందిన సాయంతోపాటు మహిళలపై జరిగిన దాడులు, లైంగిక దాడులపై కూడా విచారణ జరుపుతుంది. ఈ విచారణకు అవసరమైన సీసీటీవీ కెమెరా వీడియోల్ని కమిటీకి అందించాలని సుప్రీంకోర్టు... అధికారుల్ని ఆదేశించింది. బాధితుల నుంచి ఫిర్యాదుల్ని కూడా కమిటీ స్వీకరిస్తుంది.

# కుప్పకూలిన బంగారు గని

(మొదటిపేజీ తరువాయి)

-సెంట్రల్ ఆఫ్రికన్ రిపబ్లిక్ దేశంలో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. పశ్చిమ ప్రాంతంలో గల నానా-మాంబెరే ప్రావిన్స్ పరిధిలోని అబ్బా ప్రాంతంలో మంగళవారం ఓ బంగారు గని కుప్పకూలింది. ఈ ఘటనలో 30 మంది కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. మరికొందరు శిథిలాల కింద చిక్కుకుపోయారు. దీంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నట్టు అక్కడి అధికారులు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. నానా-మాంబెరే ప్రావిన్స్ పరిధిలోని అబ్బా ప్రాంతంలో గల బంగారు గనిలో కార్మికులు సంప్రదాయ పద్ధతుల్లో తవ్వకాలు చేపడుతుండగా ఒక్కసారిగా గని కుప్పకూలింది. ఈ ప్రమాదంలో అందులో పనిచేస్తున్న 30 మంది కార్మికులు అక్కడికక్కడే మృతి చెందారు. స్థానికులు, సహాయక బృందాలు కొన్ని గంటల పాటు శ్రమించి మృతదేహాలను బయటకు తీశాయి. గాయపడిన వారికి చికిత్స అందిస్తున్నట్టు సబ్-ప్రిఫెక్చర్ డిప్యూటీ మేయర్ సులేమాన్ బి తెలిపారు. మరోపక్క శిథిలాల కింద చిక్కుకు పోయిన వారిని కాపాడేందుకు రక్షణ చర్యలు కొనసాగుతున్నాయి. అయితే మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశమున్నట్టు స్థానికులు, అధికారులు తెలిపారు. గనిలో చిక్కుకున్న వారిని బయటకు తీసేందుకు స్వచ్ఛంద సంస్థలు, దాతలు సాయం అందించాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ ఘటనపై ప్రభుత్వ అధికార ప్రతినిధి ఎవరిస్టే ఎన్గమనా స్పందించారు.

### డీలిమిటేషన్‌తో

# అన్యాయం చేయొద్దు

(మొదటిపేజీ తరువాయి)

డిమాండ్ చేశారు. నదీ జలాల నిర్వహణ, రవాణా, లాజిస్టిక్స్, తీరప్రాంత భద్రత, మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, విపత్తు నిర్వహణ వంటి విషయాలలో దక్షిణాది రాష్ట్రాల మధ్య మరింత సహకారం అవసరమని సమావేశానికి హాజరైన నేతలు అభిప్రాయపడ్డారు. నీట్ పరీక్ష గ్రామీణ విద్యార్థులకు, సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు ప్రతికూలంగా ఉన్నదని జోసఫ్ విజయ్ చెప్పారు.

తమిళనాడుకు నీట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. రాష్ట్ర కోటా కింద ఎంబీబీయస్, బీడీయస్, ఆయుష్ కోర్సులలో ప్రవేశాలను 12వ తరగతి మార్కుల ఆధారంగా చేపట్టాలని ఆయన ప్రతిపాదించారు. కాగా సమావేశంలో నదీ జలాల అంశం కూడా ప్రధానంగా చర్చకు వచ్చింది. మేకెదాటు ప్రాజెక్టు విషయంలో సహకరించాలని కర్నాటక కోరగా గోదావరి -- కావేరి అనుసంధాన ప్రాజెక్టు ద్వారా ఐదు వందల టీయంసీలకు పైగా నీటిని మళ్లించాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రతిపాదించారు. కొత్తగా ప్రతిపాదించిన ముల్లపెరియార్ ఆనకట్ట ప్రాజెక్టుకు తమిళనాడు అంగీకరిస్తే దాని నుంచి వారికి నీరు అందేలా చూస్తానని కేరళ హామీ ఇచ్చింది. అదే సమయంలో ఓడరేవులు, రైలు అనుసంధానం, తీర ప్రాంత రక్షణ, అంతర్రాష్ట్ర భద్రత విషయంలో మరింత ప్రాంతీయ సహకారం అవసరమని అభిప్రాయపడింది.

**రాష్ట్రాలను శిక్షించవద్దు : విజయ్**

జనాభా నియంత్రణ విధానాలను విజయవంతంగా అమలు చేసిన రాష్ట్రాలు దాని పర్యవసానంగా తమ రాజకీయ ప్రాతినిధ్యాన్ని కోల్పోకూడదని తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ అన్నారు. జనాభా ఆధారిత నియోజకవర్గాల పునర్విభజన దక్షిణ రాష్ట్రాల సమిష్టి పార్లమెంటరీ వాణిని బలహీనపరుస్తుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. 'జనాభా స్థిరీకరణ, మానవాభివృద్ధి, ఆర్థిక వృద్ధిలో దక్షిణాది రాష్ట్రాలు ముందంజలో ఉన్నాయి. ఈ విజయాలు మా ప్రాతినిధ్యంలో తగ్గుదలకు దారితీయకూడదు' అని అన్నారు. జాతీయ లక్ష్యాలను నెరవేర్చినందుకు రాష్ట్రాలను శిక్షించకూడదని చెప్పారు.

**ప్రస్తుత స్థానాలతోనే మహిళా రిజర్వేషన్లు : డీకే**

1971 జనాభా లెక్కల ప్రాతిపదిక ఆధారంగానే నియోజకవర్గాల పునర్విభజన జరపాలని, రాబోయే పాతిక సంవత్సరాల పాటు లోక్‌సభలో సీట్ల సంఖ్యను 543గానే కొనసాగించాలని, ప్రస్తుత సీట్లలోనే మహిళా రిజర్వేషన్లు అమలు చేయాలని కర్నాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ సూచించారు. డీలిమిటేషన్ కారణంగా దక్షిణాది రాష్ట్రాలు సీట్లను కోల్పోవంటూ కేంద్రం ఇచ్చిన హామీని స్వాగతిస్తున్నామని, అయితే ప్రాతినిధ్యం అంటే కేవలం సంఖ్య మాత్రమే కాదని, అది బలం, గొంతుకకు సంబంధించినదని చెప్పారు. పన్నులలో కర్నాటక వాటాను 3.6 శాతం నుంచి 4.7 శాతానికి పునరుద్ధరించాలని కోరారు. కీలక మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు కేంద్రం మరింత మద్దతు అందించాలని విజ్ఞప్తి చేశారు. మాదక ద్రవ్యాల అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

**తీర ప్రాంత కోతలపై జాతీయ విధానం : సతీశన్**

మైనింగ్ చట్టానికి ప్రతిపాదించిన సవరణలను ఉపసంహరించుకోవాలని కేరళ ముఖ్యమంత్రి వీడీ సతీశన్ డిమాండ్ చేశారు. మిషన్ సముద్ర కింద రాష్ట్రాన్ని పోర్ట్ హబ్‌గా అభివృద్ధి చేయడానికి ప్రాంతీయ సహకారం అందించాలని కోరారు. కారుణ్య ఆరోగ్య సురక్షా విధానం ద్వారా ఆయుష్మాన్ భారత్ పీయం -- జేఏవై అమలుపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. తీర ప్రాంతంలో కోతను రాష్ట్ర విపత్తుగా ప్రకటించి నిరాశ్రయులైన కుటుంబాల పునరావాసం కోసం నిధుల వినియోగానికి అనుమతించాలని విజ్ఞప్తి చేశారు. తీర ప్రాంత కోతలపై జాతీయ విధానాన్ని త్వరితగతిన ఖరారు చేయాలని సూచించారు. కేరళను కర్నాటక, తమిళనాడు రాష్ట్రాలతో కలిపే అటవీ రహదారులపై రాత్రి సమయంలో పూర్తి స్థాయిలో ట్రాఫిక్ ఆంక్షలను అమలు చేయడాన్ని సతీశన్ వ్యతిరేకించారు.

**విభజన సమస్యలను పరిష్కరించండి : చంద్రబాబు**

దక్షిణాది రాష్ట్రాల మధ్య మరింత సహకారం అవసరమని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సూచించారు. కేంద్రం, రాష్ట్రాల మధ్య నెలకొన్న వివాదాలను విశ్వాసం, పరస్పర సహకారంతో పరిష్కరించుకోవచ్చునని అంటూ దక్షిణాది రాష్ట్రాల అభివృద్ధి సమన్వయం పైనే ఆధారపడి ఉంటుందని చెప్పారు. రాష్ట్ర విభజన కారణంగా తలెత్తిన సమస్యలను ప్రస్తావిస్తూ వాటి పరిష్కారాన్ని వేగవంతం చేయాలని కేంద్రాన్ని కోరారు. గోదావరి -- కావేరి అనుసంధానాన్ని ఆయన గట్టిగా సమర్థించారు. ఆంధ్రప్రదేశ్, కర్నాటక, తమిళనాడు రాష్ట్రాలను కలుపుతూ బులెట్ రైలు కారిడార్‌ను ప్రతిపాదించారు. అమరావతి, బెంగళూరు, చెన్నయ్‌లను అనుసంధానించే సమీకృత రవాణా వ్యవస్థను ఏర్పాటు చేయాలని కూడా చంద్రబాబు కోరారు.

### ప్రమాదాలు జరగకుండా

# పటిష్టమైన ఎస్‌వోపీ అమలు చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

ప్రామాణిక కార్యాచరణ విధానంఅమలు చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఈ ఘటనపై గురువారం ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించి, గాలింపు చర్యల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. సమీక్ష సందర్భంగా చంద్రబాబు పలు కీలక ప్రశ్నలను అధికారులపై సంధించారు.

"బోటులో ట్రాన్స్‌పాండర్ ఏమైంది? ఆ బోటు ఒక్కటే ఎందుకు వేటకు వెళ్లింది? గల్లంతైనట్లు సమాచారం ఎప్పుడు అందింది? గాలింపు చర్యలు ఎప్పుడు ప్రారంభించారు?" అంటూ లోతుగా ఆరా తీశారు. కేవలం ఘటన జరిగిన తర్వాత స్పందించడం కాకుండా, ముందస్తు నివారణ చర్యలపై దృష్టి సారించాలని స్పష్టం చేశారు. కోస్ట్ గార్డ్, మెరైన్ పోలీసుల ఆధ్వర్యంలో గాలింపు చర్యలను మరింత విస్తృతం చేయాలని సూచించారు.

ఈ నెల 3వ తేదీన అల్లవరం మండలం ఓడలరేవు తీరం నుంచి ఏడుగురు మత్స్యకారులు చేపల వేటకు సముద్రంలోకి వెళ్లారు. సాధారణంగా 10 రోజుల్లో తిరిగి రావాల్సి ఉండగా, గడువు దాటినా వారి నుంచి ఎలాంటి సమాచారం రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. దీంతో మెరైన్ పోలీసులు, మత్స్యశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. గల్లంతైన బోటులో 15 రోజులకు సరిపడా రేషన్, వెయ్యి లీటర్ల డీజిల్ ఉన్నాయని, ప్రాథమిక సమాచారం ప్రకారం బోటు విశాఖ లేదా పారాదీప్ వైపు వెళ్లి ఉండవచ్చని జిల్లా కలెక్టర్ మహేశ్‌కుమార్ తెలిపారు. ప్రస్తుతం కోస్ట్ గార్డ్, మెరైన్ పోలీసులు విస్తృత స్థాయిలో గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. సమీక్ష సందర్భంగా చంద్రబాబు కీలక ఆదేశాలు జారీ చేశారు. సాంకేతిక లోపాలు, భద్రతా వైఫల్యాలపై దృష్టి సారించాలని సూచించారు. గల్లంతైన మత్స్యకారుల వివరాలు: కోపనాతి రామకృష్ణ (కొమరగిరిపట్నం), సంఘాని తాతారావు (బలుసుతిప్ప), పాలెపు శాంతారావు (ఓడలరేవు), ఏసుదాస్ (అదగట్లపాలెం), కొల్లాటి శ్రీనివాస్ (ఓడలరేవు), కాటాడి సతీశ్ (పశువులంక), కర్రి రాముడు (నక్క రామేశ్వరం). వీరి ఆచూకీ కోసం అధికారులు అన్నివిధాలా ప్రయత్నిస్తున్నారు.

### గ్రూప్-1పై విచారణకు

# మేము రెడీ..

(మొదటిపేజీ తరువాయి)

ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ.. గ్రూప్-1 ఉద్యోగాల భర్తీ ప్రక్రియ గురించి వివరించారు. 2019 ఎన్నికలకు ముందు అప్పటి టీడీపీ ప్రభుత్వమే హడావిడిగా ఈ నోటిఫికేషన్ ఇచ్చిందని, తమ ప్రభుత్వం అధికారంలోకి రాకముందే మే 26న ప్రిలిమ్స్ పరీక్ష కూడా పూర్తయిందని గుర్తుచేశారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక ప్రిలిమ్స్ ఫలితాలు ప్రకటించి, 2020 డిసెంబర్‌లో మెయిన్స్ నిర్వహించామని తెలిపారు. టీడీపీ హయాంలోనే జరిగిన పరీక్షలో ఎంపికైన వారికి ఇప్పుడు రాజకీయ రంగు పులమడం దారుణమని అన్నారు. కోవిడ్ కారణంగా మూల్యాంకనం ఆలస్యం కాకూడదనే ఉద్దేశంతో ఏపీపీఎస్సీ కమిషన్ డిజిటల్ మూల్యాంకనానికి నిర్ణయం తీసుకుందని, అయితే దీనిపై కొందరు అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించారని జగన్ వివరించారు. నోటిఫికేషన్‌లో పేర్కొననందున, హైకోర్టు ఆదేశాల మేరకు డిజిటల్ మూల్యాంకనాన్ని పూర్తిగా పక్కనపెట్టి, మాన్యువల్ పద్ధతిలోనే జవాబు పత్రాలను దిద్దామని స్పష్టం చేశారు. ఆ మార్కుల ఆధారంగానే 163 మందికి ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగాలు ఇచ్చామని, ఈ ప్రక్రియ మొత్తం హైకోర్టు పర్యవేక్షణలోనే జరిగిందని తెలిపారు. ఇప్పుడు సంబంధం లేని డిజిటల్ మూల్యాంకనంపై ఆరోపణలు చేయడం కేవలం ఉద్యోగుల జీవితాలతో ఆడుకోవడమేనని విమర్శించారు.

గ్రూప్-1 మూల్యాంకనం హాయ్‌ల్యాండ్‌లో జరిగిందంటూ చేస్తున్న ప్రచారాన్ని జగన్ తీవ్రంగా ఖండించారు. అక్కడ ఎలాంటి మూల్యాంకనం జరగలేదని, ఈ విషయాన్ని ప్రస్తుత కూటమి ప్రభుత్వం నియమించిన సిట్ కూడా హైకోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో పేర్కొందని గుర్తుచేశారు. తమపై బురద జల్లేందుకు దర్యాప్తు బృందాలను వాడుకోవడం చంద్రబాబుకు అలవాటేనని ఆరోపించారు. నాలుగేళ్లుగా ఉద్యోగాలు చేస్తున్న వారిపై విషం కక్కుతూ, వారి భవిష్యత్తును నాశనం చేయాలని చూడటం సరికాదని జగన్ హితవు పలికారు. ఎన్ని అబద్ధాలు ప్రచారం చేసినా చివరకు నిజమే గెలుస్తుందని ఆయన అన్నారు.

### జగన్‌కు ఏపీపీఎస్సీ,

# డీఎస్సీకి తేడా తెలియదు

(మొదటిపేజీ తరువాయి)

అంటే ఏమిటో తెలియదు, డీఎస్సీ అంటే ఏమిటో తెలియదు. రెండూ ఒకటే అని జగన్ భావిస్తున్నారు" అంటూ లోకేశ్ తన పోస్ట్‌లో ఎద్దేవా చేశారు. రాష్ట్రంలోని నియామక వ్యవస్థలపై జగన్‌కు ఉన్న అవగాహన లోపం వల్లే గత ఐదేళ్ల పాలనలో ఒక్క డీఎస్సీని కూడా నిర్వహించలేకపోయారని విమర్శించారు. ఉద్యోగ నియామకాలపై అసెంబ్లీలో జరిగే చర్చ నుంచి కూడా జగన్ పారిపోతున్నారని ఆక్షేపించారు. ఏపీపీఎస్సీ (ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్), డీఎస్సీ (జిల్లా ఎంపిక కమిటీ)... ఈ రెండు వేర్వేరు వ్యవస్థలనే కనీస పరిజ్ఞానం కూడా జగన్‌కు లేదని లోకేశ్ విమర్శించారు. తన పోస్టుకు చణూజఖీుNవండీవ్‌జ్రూ, #JaganAPPSCrecruitmentScam వంటి హ్యాష్‌ట్యాగ్‌లను కూడా ఆయన జతచేశారు.

# లక్నోలో దారుణ ఘటన








**హైదరాబాద్ - సూర్య వాస్తవం**

ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలో దారుణ ఘటన చోటుచేసుకుంది. ఐసీఐసీఐ బ్యాంకులో రిలేషన్‌షిప్ మేనేజర్‌గా పనిచేస్తున్న తన భార్య దివ్య మిశ్రాపై ఆమె కార్యాలయం వద్ద భర్త మానస్ మిశ్రా కాల్పులు జరిపాడు. తీవ్రంగా గాయపడిన ఆమెను ఆస్పత్రికి తరలించగా మృతి చెందారు. అనంతరం హుసారియా ప్రాంతంలోని తన నివాసానికి వెళ్లిన మానస్.. అక్కడ తన సోదరి షీబా బజ్‌పాయ్‌పై కూడా కాల్పులు జరిపాడు. ఆ తర్వాత తనపై కాల్పులు జరుపుకుని మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు, ఫోరెన్సిక్ బృందాలు ఘటనా స్థలాలకు చేరుకుని దర్యాప్తు చేపట్టాయి. భార్యాభర్తల మధ్య కొంతకాలంగా విభేదాలు ఉన్నట్లు పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. ఈ కేసుపై దర్యాప్తు చేపడుతున్నట్లు తెలిపారు.

## ఆదోని భీమా పాలిటెక్నిక్ కళాశాల

# టాపర్‌గా తలారి ప్రతుల్...!

- 896/1000 మార్కులతో కళాశాల టాపర్‌గా ప్రతుల్..
- కుమారుడి విజయంపై ఆనందం వ్యక్తం చేసిన అడ్వకేట్ తలారి సాయి...
- ప్రతుల్‌ను అభినందించిన కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు...





**ఆదోని టౌన్ - సూర్య వాస్తవం :** ఆదోని పట్టణానికి చెందిన సీనియర్ అడ్వకేట్ తలారి సాయి కుమారుడు తలారి ప్రతుల్ 2026 డిప్లమా పరీక్ష ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచాడు. ఆదోని భీమా పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లమా ఇన్ సివిల్ ఇంజనీరింగ్ ఫైనల్ సెమిస్టర్‌లో 1000 మార్కులకు గాను 896 మార్కులు సాధించి కళాశాల టాపర్‌గా నిలిచాడు. చిన్ననాటి నుంచి క్రమశిక్షణతో చదువుతూ, పట్టుదలతో విద్యాభ్యాసం కొనసాగించిన ప్రతుల్ ఈ ఘనత సాధించడం పట్ల కళాశాల అధ్యాపకులు, స్నేహితులు అభినందనలు తెలిపారు. తన విజయానికి సహకరించిన తల్లిదండ్రులు, గురువులకు ప్రతుల్ కృతజ్ఞతలు తెలిపాడు.తమ కుమారుడు కళాశాల టాపర్‌గా నిలవడం ఎంతో ఆనందంగా ఉందని అడ్వకేట్ తలారి సాయి తెలిపారు. ప్రతుల్‌కు విద్యాబోధన అందించిన కళాశాల యాజమాన్యం, అధ్యాపకులకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

# పేద వారికి సంక్షేమ పలాలు అందించడం చంద్రబాబుతోనే సాధ్యం

- వై.నాగేశ్వరావు యాదవ్ కర్నూలు
డీసీఎంఎస్ చైర్మన్ అండ్ హిందూపురం పరిశీలకులు



**కర్నూల్ - సూర్య వాస్తవం:** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు హిందూపురం నియోజకవర్గ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఆధ్వర్యంలో "ఇంటింటికి తెలుగుదేశం--2026" కార్యక్రమం నిర్వహించబడు తోంది. ఇందులో భాగంగా నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో ఇంటింటి పర్యటనలు చేపట్టారు. హిందూపురం నియోజకవర్గం లోని బూత్ నశీ: 22,21,20,19. చాగలేరు పంచాయతీ, సన్నగపల్లి గ్రామంలో బూత్ నశీ:-208, పరిధిలో ఇంటింటి పర్యటనలు నిర్వహించి ప్రజల సమస్యలు, అవసరాలు మరియు అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బూత్ ఇన్‌చార్జ్:- ప్రకాష్, ప్రతాప్ రెడ్డి, నరేంద్ర, ధనుంజయ, శ్రీనివాస్ రెడ్డి, యూనిట్ ఇన్‌చార్జ్: వేణుగోపాల్, సీబీ నారాయణరెడ్డి స్థానిక నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు. గురువారం నాటికి ఇంటింటి పర్యటన పురోగతి హిందూపురం నియోజకవర్గంలో మొత్తం 83,194 కుటుంబాలకు గాను ఇప్పటివరకు 47,712 కుటుంబాలను సందర్శించారు. మొత్తం కుటుంబాలు: 83,194, విసిటెడ్ : 47,712 కుటుంబాలు, నాట్ విసిటెడ్ : 35,482 కుటుంబాలు. ఈ నెల 25 వ తేదీ వరకు మాత్రమే డోర్ టు డోర్ కార్యక్రమం ఉంటుంది. కావున ఈ 5 రోజులు లోపు మీ. బూత్ పరిధిలో లో ఉన్న అన్ని గృహాలను పూర్తి చేయాలనీ మనవిఇంకా సందర్శించాల్సిన కుటుంబాలను కూడా త్వరితగతిన చేరుకునేలా క్లస్టర్, యూనిట్ మరియు బూత్ స్థాయి ఇన్‌చార్జుల సమానంయ్యంతో ముందుకు వెళ్ళాలి అని సూచించారు.

# రేపు జాతీయస్థాయిలో ఖేల్ కూద్ ఆటల పోటీలు

**పామిడి - సూర్య వాస్తవం:** అనంతపురం జిల్లాపామిడి సరస్వతి విద్యా మందిరం ఉన్నతపాఠశాల నందు ఈనెల విద్యాభారతి ఆంధ్ర ప్రదేశ్ ఆధ్వర్యంలో 22,23 తేదీలలో రాష్ట్రస్థాయి ఖేల్ కూద్(ఆటల పోటీలు ) పోటీలు నిర్వహించబడుని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం విద్యా మందిరంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ఆటల పోటీలలో జాతీయ స్థాయి నుంచి దాదాపుగా 738 విద్యార్థులు,100 మంది ఆచార్యులు, పిఈటి లు పాల్గొనుచున్నారన్నారు.రాష్ట్ర స్థాయి పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు క్షేత్రస్థాయి, అఖిల భారతీయ స్థాయిలో ఆటల పోటీలు నిర్వహించబడునని,ఈ రాష్ట్రస్థాయి పోటీలు 22 శనివారంన ఉద్ఘాటనతో ప్రారంభమై ఆదివారం 4 గం . లకు పూర్తి అగునన్నారు. ఇందులో అథ్లెట్స్, పరుగు పోటీలు, హైజంప్, లాంగ్ జంప్, షార్ట్ పుట్, జావలిన్, డిస్క్ వంటి వ్యక్తిగత పోటీలు మరియు కబడ్డీ, ఖోఖో, వాలీ బాల్, చెస్, యోగా, షటిల్ వంటి జట్టు పోటీలు నిర్వహించబడునని పేర్కొన్నారు.రెండురోజుల కార్యక్రమమునకు విద్యార్థులు వారి తల్లిదండ్రులు మండల వ్యాప్తంగా ఉన్న నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు విచ్చేసి విద్యార్థుల ప్రదర్శనను తిలకించవలసినదిగా కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఆచారి శ్రీనివాసులు చౌడయ్య పుల్లారెడ్డి నల్లపరెడ్డి బసవరాజు ఆచార్య బృందం తదితరులు పాల్గొన్నారు.




## రైతుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న

# అగ్రిసోల్ పరిశ్రమను తక్షణమే మూసివేయాలి

- ప్రమాదాలకు గురైన కార్మికుల కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించాలి
- కార్మికులను భయభ్రాంతులకు గురిచేస్తూ వెట్టిచాకిరి చేయిస్తున్న యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలి
- సీపీఎం పట్టణ కార్యదర్శి నక్కీ శ్రీకాంత్ డిమాండ్




**డోన్ - సూర్య వాస్తవం:** డోన్ పట్టణానికి సుమారు ఐదు కిలోమీటర్ల పరిధిలో ఉన్న అగ్రిసోల్ పరిశ్రమ నుంచి వెలువడుతున్న వ్యర్థాలు వాయు కాలుష్యం కారణంగా చుట్టుపక్కల గ్రామాల ప్రజలు రైతాంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రజల ఆరోగ్యంతో పాటు పర్యావరణం వ్యవసాయం తీవ్రంగా దెబ్బతింటున్నందున అగ్రిసోల్ పరిశ్రమను తక్షణమే మూసివేసి సమగ్ర విచారణ జరిపించాలని సిపిఎం పార్టీ పట్టణ కార్యదర్శి నక్కీ శ్రీకాంత్ డిమాండ్ చేశారు. గురువారం సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో అగ్రిసోల్ కంపెనీ ముందు ఆందోళన నిర్వహించారు కంపెనీ యాజమాన్యం నిర్లక్ష్య వైఖరిపై ఆగ్రహం వ్యక్తం చేసిన సిపిఎం నాయకులు, కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, ప్రమాదాలకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. అనంతరం కంపెనీ గేటు వద్ద బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా విచారణకు వచ్చిన సంబంధిత అధికారులు కంపెనీ యాజమాన్యానికి అనుకూలంగా వ్యవహరిస్తూ, ఆందోళన చేస్తున్న కార్మికులు, ప్రజల సమస్యలను పట్టించుకోకుండా మరో మార్గం ద్వారా ఫ్యాక్టరీలోకి వెళ్లేందుకు ప్రయత్నించడంపై సిపిఎం నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల వాహనాలను చుట్టుముట్టి, ముందుగా కంపెనీపై చర్యలు తీసుకోవాలని, ఫ్యాక్టరీలో జరుగుతున్న పరిస్థితులపై సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. విషయం ఉద్రిక్తంగా మారడంతో పట్టణ సిఐ ఇంతియాజ్ భాష, ఎస్సై శరత్ కుమార్ రెడ్డి, పోలీసు అధికారులు అక్కడికి చేరుకుని సిపిఎం నాయకులతో మాట్లాడారు. అధికారులు సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో సిపిఎం నాయకులు శాంతియుతంగా నిరసనను విరమించారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ పట్టణ కార్యదర్శి నక్కీ శ్రీకాంత్, మండల కార్యదర్శి రామాంజనేయులు, సిఐటియు మండల నాయకులు నాగమద్దయ్య, రహిమాన్, ఐద్వా నాయకురాలు షేమిమ్ బేగం, డివైఎఫ్ఐ మండల కార్యదర్శి నక్కీ హరి, అశోక్ మాట్లాడుతూ అగ్రిసోల్ పరిశ్రమ నుంచి వెలువడుతున్న వ్యర్థాలు, వాయు కాలుష్యం, పరిశ్రమ కార్యకలాపాల వల్ల పరిసర ప్రాంతాల పర్యావరణంపై తీవ్ర ప్రభావం పడుతోందని ఆరోపించారు.

ఉములపాడు, అబ్బిరెడ్డిపల్లె, వెంకటాపురం, జగదుర్తి, తాటిమానుకొత్తూరు గ్రామాలతో పాటు జగనన్న కాలనీలలో నివసిస్తున్న ప్రజలు దుర్వాసన, కాలుష్యం తదితర సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని వారు తెలిపారు. మహిళలు, వృద్ధులు చిన్నారులు తీవ్ర అనారోగ్య సమస్యలకు గురవుతున్నారని ప్రజల ఆరోగ్యంపై ప్రభావం పడుతున్నా సంబంధిత అధికారులు ఇప్పటివరకు శాశ్వత పరిష్కారం చూపకపోవడం దురదృష్టకరమన్నారు.

పరిశ్రమ నుంచి వెలువడే వ్యర్థాల వల్ల భూగర్భ జలాలు కలుషితం అవుతున్నాయా? వాయు కాలుష్యం ప్రమాణాలకు లోబడి ఉందా? పరిశ్రమ వ్యర్థాలను నిబంధనల ప్రకారం శుద్ధి చేస్తున్నారా? అనే అంశాలపై నిపుణుల బృందంతో శాస్త్రీయంగా పరీక్షలు నిర్వహించాలని వారు డిమాండ్ చేశారు. పరిశ్రమ చుట్టుపక్కల గ్రామాల్లో గాలి, నీరు, నేల నమూనాలను సేకరించి ప్రజలకు వాస్తవాలను వెల్లడించాలని కోరారు. అదేవిధంగా ఈ ప్రాంతంలోని రైతులు సాగు చేస్తున్న పంటలపై కూడా కాలుష్య ప్రభావం పడుతోందని, పంట దిగుబడులు తగ్గడం, పంటలు దెబ్బతినడం వల్ల రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కాలుష్యం కారణంగా రైతులకు నష్టం వాటిల్లినట్లయితే శాస్త్రీయంగా అంచనా వేసి బాధిత రైతులకు నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. కార్మికుల భద్రత విషయంలో కూడా అగ్రిసోల్ యాజమాన్యం తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని సిపిఎం నాయకులు ఆరోపించారు. కంపెనీలో జరిగిన ప్రమాదాల్లో గాయపడిన, కార్మికుల కుటుంబాలకు న్యాయం చేయాలని, బాధిత కుటుంబాలకు తగిన నష్టపరిహారం, ఉపాధి భద్రత కల్పించాలని కోరారు. కార్మికుల భద్రతా ప్రమాణాలు, రక్షణ పరికరాలు, అత్యవసర వైద్య సదుపాయాలు, ఫ్యాక్టరీలో భద్రతా నిబంధనల అమలుపై సమగ్ర తనిఖీ నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్మికులను భయభ్రాంతులకు గురిచేసి, హక్కులను ప్రశ్నించకుండా చేయడం, అధిక పని గంటలు చేయించడం, తగిన భద్రతా సదుపాయాలు కల్పించకపోవడం వంటి ఆరోపణలపై కార్మిక శాఖ అధికారులు విచారణ జరపాలని వారు కోరారు. కార్మికులపై ఎలాంటి ఒత్తిడి లేకుండా వారి వాంగ్మూలాలను స్వతంత్రంగా నమోదు చేసి, చట్టాలను ఉల్లంఘించిన యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



అగ్రిసోల్ పరిశ్రమపై కాలుష్య నియంత్రణ మండలి, రెవెన్యూ, కార్మిక, వైద్య ఆరోగ్య, వ్యవసాయ శాఖల అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించాలని, పరిశ్రమకు సంబంధించిన అనుమతులు, పర్యావరణ నిబంధనల అమలు, వ్యర్థాల నిర్వహణ, కార్మికుల భద్రత తదితర అంశాలపై పూర్తి స్థాయి విచారణ జరిపించాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ప్రజల ఆరోగ్యం, రైతుల జీవనోపాధి, కార్మికుల భద్రత కంటే పరిశ్రమ యాజమాన్య ప్రయోజనాలకు అధికారులు ప్రాధాన్యత ఇస్తే సిపిఎం పార్టీ చూస్తూ ఊరుకోదని వారు హెచ్చరించారు. ప్రజల ప్రాణాలను, రైతుల పంటలను, కార్మికుల హక్కులను కాపాడే వరకు పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు.

**అధికారులు నిర్లక్ష్యం చేయకుండా తక్షణమే చర్యలు తీసుకోవాలి**

ప్రజలు, రైతాంగం, కార్మికుల ప్రాణాలతో చెలగాటమాడే పరిశ్రమలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలి. అగ్రిసోల్ పరిశ్రమను తక్షణమే మూసివేసి ప్రజలకు న్యాయం చేసే వరకు సిపిఎం పార్టీ పోరాటం కొనసాగిస్తుందని నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాధవి, సూర్యపద్మావతి,షాబాన, బీబీ,అమృత,మాధవి, రాజు, నరసింహులు, రాము, మదన్ గోపాల్, సురేష్, రాజశేఖర్, హాబీబ్ బాషా, మహమ్మద్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

## పరిశ్రమలు, ఫ్యాక్టరీల పేరిట

# రైతులకు భూములను దూరం చేయొద్దు

- రైతు సంఘం,
సీపీఐ నాయకుల డిమాండ్



**బనగానపల్లె - సూర్య వాస్తవం:** బనగానపల్లె మండలం పాతపాడు గ్రామంలో రైతులతో సమావేశం జరిగింది. పాతపాడు పంచాయతీ మీరాపురం పంచాయతీ లలో హైడ్రో పవర్ ప్రాజెక్ట్ సోలార్ ప్రాజెక్ట్ మాకొద్దు అంటున్న రైతులు ఎన్నో ఏళ్లుగా ఈ పొలాలు పండించుకొని జీవనం గడుపుతున్నాం మా పొలాలను మాకు దూరం చేయొద్దని పరిశ్రమల పేరిట ఫ్యాక్టరీల పేరిట ఆధునికత పేరిట అభివృద్ధి పేరిట మా పొలం గుండెల్లోంచి పొగ గొట్టాలువద్దని మా పంట చేల కంతాలకు ఉరి తాళ్లు వెయ్యొద్దని రైతు నుండి భూమిని వేరు చేస్తే రైతు అనే పదం కనుమరుగైపోతుందని ఆర్థిక మండల పేరా పొలాలన్నీ బహుళ జాతి కంపెనీలకు అప్పగిస్తే ఆహార పంటలన్నీ అడ్రస్సులు కోల్పోతే సాఫ్ట్వేర్ కంపెనీలు ఆకలి తీరుస్తాయా అన్నం మెతుకుల బదులు టాబ్లెట్స్ వేసుకొని మన బ్రతుకు కాలమెల్ల తీసుకోవాల్సిందే మా నుంచి మా భూములు దూరం చేయొద్దని వాపోయారు ఈ సమావేశం లో రైతు సంఘము రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ సిపిఐ నంద్యాల జిల్లా కార్యదర్శి రంగనాయుడు మాట్లాడుతూ పరిశ్రమల పేరుతో రైతుల దగ్గర నుంచి బలవంతపు సేకరణ ఆపాలని అధికారులు అధికార పార్టీ నాయకులు తమ స్వలాభం కోసం మాయ మాటలు చెప్పి మాయ చేస్తారని వారి మాయమాటలు నమ్మి మోసపోవద్దని పొలం అంటే రైతుకు ఆత్మ గౌరవం అని మీ పొలాల కోసం మీరు చేసే పోరులో ఎర్రజెండా ముందుంటుందని వారన్నారు భూములను బలవంతంగా సేకరించవద్దు

**2013 భూసేకరణ చట్టం ప్రకారమే చర్యలు చేపట్టాలి**

ప్రాజెక్టుల పేరుతో రైతుల సాగు భూములను బలవంతంగా సేకరించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాము. రైతుల జీవనాధారమైన భూములను తీసుకునే ముందు భూసేకరణ, పునరావాసం మరియు పునరావాస హక్కుల చట్టం--2013 ప్రకారం అన్ని చట్టపరమైన నిబంధనలను తప్పనిసరిగా పాటించాలి. రైతులకు ముందస్తు సమాచారం ఇవ్వడంతో పాటు, భూముల సర్వే, సామాజిక ప్రభావ అంచనా, ప్రజాభిప్రాయ సేకరణ, న్యాయమైన పరిహారం, పునరావాసం మరియు పునరావాస ప్యాకేజీ వంటి అన్ని హక్కులను కల్పించాలని రైతుల అంగీకారం మరియు చట్టపరమైన ప్రక్రియను పక్కనపెట్టి మా భూములను స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నిస్తే తీవ్రంగా ప్రతిఘటిస్తాము. మా భూములు, రైతుల జీవనాధారాన్ని కాపాడుకునేందుకు చట్టపరమైన మార్గాల్లో పోరాటం చేస్తాము. 2013 భూసేకరణ చట్టం ప్రకారం పూర్తి న్యాయం జరిగే వరకు రైతుల భూములను సేకరించవద్దని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని వారన్నారు. ఈ సమావేశం లో రైతు సంఘము నాయకులు రాజశేఖర్ సుబ్బారాయుడు యాగంటి బసవేశ్వర రైతు సంఘము నాయకులు. కొండా రెడ్డి నారాయణ రెడ్డి సిపిఐ మండల కార్యదర్శి శివయ్య సీఐటీయూ నాయకులు సుబ్బయ్య బాలవెంకట్ రైతులు పాల్గొన్నారు.

# దశాబ్దాల తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా కృషి

**- ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం**





**గుత్తి - సూర్య వాస్తవం:** గుత్తి తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు ఏ.ఐ.ఐ.బీ పథ కం కింద రూ.250 కోట్లతో 45 కిలోమీటర్ల మేర నూత న పైపు లైన్ నిర్మాణం. ఏళ్ల నిరీక్షణకు తెర,గుత్తి మున్సి పాలిటీ ప్రజలు దశాబ్దాలు గా ఎదుర్కొంటున్న తాగునీ టి సమస్యకు శాశ్వత పరి ష్కారం కల్పించే దిశగా చ ర్యలు వేగవంతమవుతు న్నాయి.గుంతకల్లు నియో జకవర్గ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం ఇచ్చిన హామీ మేరకు గుత్తి పట్టణానికి తా గునీటి సరఫరాను ఎన్నికల సమయంలో గుత్తి పట్టణ ప్రజలు తమ చిరకాల తాగు నీటి సమస్యను ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం దృష్టికి తీసుకెళ్లారు. అధికారంలోకి వచ్చిన అనంతరం స మస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. గుత్తి పట్టణానికి తా గునీటి సరఫరాను మెరుగు పరిచే లక్ష్యంతో సుమారు రూ.250 కోట్ల వ్యయంతో మిడ్ పెన్నార్ డ్యామ్ నుంచి గుత్తి వరకు నూతన పైపు లైన్ ఏర్పాటు చేసే పనులు చే పట్టినట్లు సమాచారం.మిడ్ పెన్నార్ డ్యామ్ నుంచి కోనే పల్లి,కత్రిమల,పాల్యం ఎద్దు లపల్లి,సొరకాయల పేట మీ దుగా జాతీయ రహదారి మార్గంలో గుత్తి వరకు సు మారు 45 కిలోమీటర్ల మేర నూతన పైపు లైన్ నిర్మాణం చేపడుతున్నట్లు స్థానిక వ ర్గాలు తెలిపాయి.ప్రస్తుతం పనులు వివిధ దశల్లో కొన సాగుతూ ఉన్నాయని,వా టిని వేగవంతంగా పూర్తి చే సి పట్టణ ప్రజలకు మెరుగైన తాగునీటి సరఫరా అందిం చేందుకు గుంతకల్ ఎమ్మె ల్యే గుమ్మనూరు జయరాం ఎమ్మెల్యేకు,యువనేతకు కృతజ్ఞతలు.తమ చిరకాల తా గునీటి సమస్య పరిష్కా రం కోసం చర్యలు చేపట్టిన ఎమ్మెల్యే గుమ్మనూరు జ యరాంతో పాటు గుత్తి,పా మిడి నియోజకవర్గ ఇన్ చా ర్జ్,యువనేత గుమ్మనూరు ఈశ్వర్‌కు గుత్తి పట్టణ ప్రజ లు కృతజ్ఞతలు తెలిపారు.

# దళితుల సమస్యల పరిష్కారం కోసం 24న కలెక్టరేట్ ఎదుట మహాధర్నా



**పామిడి - సూర్య వాస్తవం:** పామిడి పట్టణంలో ఎద్దులపల్లి రోడ్డులోని అంబేద్కర్ విగ్రహం సర్కిల్ లో జీపు యాత్ర సందర్భంగా గురువారం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఓ.నల్లప్ప మాట్లాడుతూ అనంతపురం జిల్లాలో దళితవాడల్లో ఉన్న ప్రదాన సమస్యలను గుర్తించి పరిష్కారానికి అధికారులు పూర్తి న్యాయంచేయాలని, ఈనెల 24వ తేదీ సోమవారంఅనంతపురం కలెక్టర్ ఆఫీస్ ముందు కేవీపీస్ సంఘం ఆధ్వర్యంలో మహా ధర్నా నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.ప్రతి గ్రామంలో దళితులకు కావలసిన స్మశాన స్థలం,ఇంటిస్థలాలు, కుల వివక్షణ గ్రామాలలో కనీసమౌలిక సదుపాయాలు నోచుకోని దళిత కాలనీలలో వీధిదీపాలు,సిసి రోడ్లు, సమస్యలపై ఉపాధి జీవనోపాధి దళిత డప్పు,ఉరుములు, కళాకారులు, చర్మకారులు, కాటికాపర్లు,పెన్షన్ల కోసం ఎదురుచూస్తున్న దళితులందరూ ఏకమై ఈనెల 24 న సోమవారం కలెక్టరేట్ ని ముట్టడిద్దామని, జిల్లావ్యాప్తంగా ఉన్న గదితులందరూ కదలి వచ్చి పాల్గొనాలని పిలుపునిచ్చారు . ఈకార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ఓ.నల్లప్ప జిల్లా కార్యదర్శి కృష్ణమూర్తి,జిల్లా రైతు సంఘం అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి,గుంతకల్ నియోజకవర్గం ఇన్చార్జి, డి శ్రీనివాసులు,గుత్తి మండల కార్యదర్శి నిర్మలమ్మ, జిల్లా కార్యవర్గ సభ్యులు రేణుకమ్మ, మండల కార్యదర్శి మల్లేష్,పామిడి మండల నాయకులు, కార్యకర్తలు దళితులు తదితరులు పాల్గొన్నారు.

# తిరుమల దేవస్ధానం నుండి భజన బృందానికి ఆహ్వానం



**గార్లదిన్నె- సూర్య వాస్తవం:** గార్లదిన్నె మండలంలోని కొప్పులకొండ గ్రామం భజన బృందానికి కలియుగదైవం తిరుమల తిరుపతి వెంకటేశ్వరస్వామి సన్నిధిలో 21న శు క్రవారం భజన చేయుటకు ఆహ్వానం రావడంతో, 20న గురువారం తిరుమలకు బయలుదేరి వెళుతున్నామని ఆభజన బృందం నాయకులు డీలర్ బెస్త ఓబులేసు, బియ్యం వ్యాపారి బెస్త వెంకటరాముడు తెలిపారు. ఈ సందర్భంగా కల్లూరు రైల్వే స్టేషన్‌లో వారు మాట్లాడుతూ ఆదేవ దేవుని సన్నిధిలో భజన చేయుటకు అవకాశం రావడం మాపూర్వ జన్మ సుకృతంగాలి భావిస్తున్నామని, ఇలావెళ్లడం వరసుగా ఇది 5 వసారి అన్నారు.ఓం నమో వెంకటేశాయ, ఓం నమో తిరుమలేశాయ, నమో నమో నారాయణ అంటూ జపము,తపము చేసుకుంటూ తిరుపతి రైలు ఎక్కారు.

# కంపు కొడుతున్న సూపర్ స్పెషలిటీ ఆసుపత్రి...!

- మురుగు కాలువ నుంచి వెదజల్లుతున్న దుర్వాసనతో ఆసుపత్రిలో తీవ్ర అసౌకర్యం
- చికిత్స కోసం వచ్చిన రోగులకు తప్పని దుర్వాసన బాధలు..
- ఆసుపత్రి వెనుక భాగంలో అపరిశుభ్రతపై వెల్లువెత్తుతున్న విమర్శలు..
- సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పరిసరాల పరిశుభ్రతపై అధికారుల నిర్లక్ష్యమా..?




**అనంతపురం వైద్యం - సూర్య వాస్తవం :** ప్రజలకు అత్యున్నత వైద్య సేవలు అందించాల్సిన అనంతపురం సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఆవరణలోనే అపరిశుభ్రత సమస్య రోగులను, వైద్య సిబ్బందిని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. ఆసుపత్రి వెనుక భాగంలో ఉన్న మురుగు కాలువలో మురుగునీరు నిలిచిపోవడంతో తీవ్రమైన దుర్వాసన వెదజల్లుతున్నట్లు రోగులు, వారి సహాయకులు, ఆసుపత్రి సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



**ఆసుపత్రిలోకి చేరుతున్న కంపు**

కాలువ నుంచి వస్తున్న దుర్వాసన ఆసుపత్రి పరిసరాలకే పరిమితం కాకుండా లోపలికి కూడా వ్యాపిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే అనారోగ్యంతో ఆసుపత్రికి వచ్చిన రోగులకు ఈ దుర్వాసన మరింత అసౌకర్యాన్ని కలిగిస్తోంది. వారితో పాటు రోగుల సహాయకులు, వైద్యులు, నర్సులు, ఇతర సిబ్బంది కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**ఆరోగ్య కేంద్రం వద్దే అపరిశుభ్రత!**

ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాల్సిన ఆసుపత్రి పరిసరాల్లోనే మురుగు కాలువలు సక్రమంగా నిర్వహించకపోవడం పట్ల పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మురుగునీరు నిల్వ ఉండటం వల్ల దుర్వాసనతో పాటు పరిసరాల పరిశుభ్రతపైనా ప్రభావం పడే అవకాశం ఉందని వారు పేర్కొంటున్నారు.

**శాశ్వత పరిష్కారం చూపాలి**

సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి సూపరింటెండెంట్ స్పందించి సంబంధిత మునిసిపల్ శాఖ అధికారులతో మాట్లాడి మురుగు కాలువను తక్షణమే శుభ్రం చేయించాలని రోగులు, వారి సహాయకులు, ఆసుపత్రి సిబ్బంది కోరుతున్నారు.

కేవలం తాత్కాలికంగా శుభ్రం చేయడం కాకుండా మురుగునీరు నిలిచిపోకుండా శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఆసుపత్రి ఆవరణలో దుర్వాసన సమస్యకు అధికారులు ఎప్పుడు చెక్ పెడతారో వేచి చూడాలి.

# జర్నలిస్టులకు హౌసింగ్ సౌకర్యం కల్పించాలి...!

- అసెంబ్లీలో జర్నలిస్టుల సమస్యలపై గళమెత్తిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి...
- ప్రతి జిల్లాలో అక్రిడిటెడ్ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి.
- జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా పరిష్కరించాలి



**అమరావతి - సూర్య వాస్తవం :** జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు లేదా గృహ సౌకర్యం కల్పించాలని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. అమరావతి వెలగపూడిలో జరుగుతున్న ఆంధ్రప్రదేశ్ శాసనసభ వర్షాకాల సమావేశాల్లో జీరో అవర్‌లో ఆమె జర్నలిస్టుల సమస్యలను ప్రస్తావించారు.ప్రజాస్వామ్యానికి నాలుగో స్థంభంగా జర్నలిస్టులు కీలక పాత్ర పోషిస్తున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. సమాజంలో జరుగుతున్న అన్యాయాలు, ప్రజా సమస్యలు, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో వారు ముఖ్యమైన బాధ్యతను నిర్వహిస్తున్నారని తెలిపారు.క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియా ప్రతినిధుల్లో అధిక శాతం మంది తక్కువ వేతనాలతో పనిచేస్తున్నారని, దీంతో సొంతంగా ఇల్లు నిర్మించుకోవడం వారికి పెద్ద సవాల్‌గా మారిందని అన్నారు. వృత్తిలో స్థిరత్వం లేకపోవడం, నిర్దిష్టమైన పనివేళలు లేకపోవడం వల్ల జర్నలిస్టులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు.ప్రభుత్వం అందించే ఆరోగ్య కార్డులు, గృహనిర్మాణ పథకాలు వంటి ప్రోత్సాహకాలు జర్నలిస్టుల కుటుంబాలకు సామాజిక భద్రతను కల్పిస్తాయని గళ్ళా మాధవి పేర్కొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జూబ్లీహిల్స్ వంటి ప్రాంతాల్లో జర్నలిస్టు కాలనీలు ఏర్పాటు చేసిన విషయాన్ని ఆమె గుర్తు చేశారు.విభజిత ఆంధ్రప్రదేశ్‌లో జర్నలిస్టులకు గృహ సౌకర్యాలు కల్పించాలనే ఉద్దేశంతో జి.ఓ. నెం. 67, 107లను తీసుకువచ్చిన విషయాన్ని ఎమ్మెల్యే ప్రస్తావించారు. ఆ జీవోలను అమలు చేస్తూ రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో అక్రిడిటేషన్ కలిగిన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు లేదా గృహ సౌకర్యం కల్పించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును సభ ద్వారా కోరారు. ప్రతి వర్గాన్ని తన కుటుంబ సభ్యులుగా భావించి వారి అభ్యున్నతికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జర్నలిస్టుల సమస్యలను కూడా సానుకూలంగా పరిష్కరిస్తారనే ఆశాభావాన్ని ఎమ్మెల్యే వ్యక్తం చేశారు.

# ఉరవకొండలో రైతుల ఆందోళన....!

**- హంద్రీనీవా కాల్వ నుంచి పంటలకు నీరు విడుదల చేయాలని డిమాండ్..**



**ఉరవకొండ టౌన్ - సూర్య వాస్తవం :** హంద్రీనీవా ప్రధాన కాల్వ నుంచి పంటలకు సాగునీరు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మండలంలోని పలు గ్రామాలకు చెందిన రైతులు గురువారం ఉరవకొండ తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. కార్యాలయానికి తలుపులు వేసి కొద్దిసేపు కార్యకలాపాలను అడ్డుకున్నారు. తమ సమస్యను అధికారులు పట్టించుకోవడం లేదంటూ రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు.అనంతరం రైతులు పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట ప్రధాన రహదారిపై బైఠాయించి రాకపోకలను అడ్డుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని రైతులతో మాట్లాడి, సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. అనంతరం రాకపోకలు పునరుద్ధరించారు.నీరు ఉన్నా వినియోగించుకోలేకపోతున్నాం హంద్రీనీవా ప్రధాన కాల్వలో కృష్ణా జలాలు నిండుగా ప్రవహిస్తు న్నప్పటికీ తాము మోటార్ల ద్వారా నీటిని వినియోగించుకోకుండా అధికారులు విద్యుత్ సరఫరాను నిలిపివేశారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఉపకాల్వలకు నీరు చేరకుండా షట్టర్లను దించడంతోపాటు మట్టిని అడ్డుగా వేశారని ఆరోపించారు.

**పంటలు ఎండిపోయే పరిస్థితి**

ఇప్పటికే కంది, వేరుశనగ పంటలను సాగు చేశామని, మిరప సాగు కోసం నర్సరీల్లో నారు పెంచుకున్నామని రైతులు తెలిపారు. తక్షణమే సాగునీరు విడుదల చేయకపోతే పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందన్నారు. మిరప నారు ముదిరిపోయి నాటుకు పనికిరాకుండా పోతుందని, దీంతో లక్షల రూపాయల నష్టం వాటిల్లుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి హంద్రీనీవా ప్రధాన కాల్వ ద్వారా పంటలకు సాగునీరు విడుదల చేసి తమ పంటలను కాపాడాలని రైతులు కోరారు.

# ఘనంగా శ్రీకృష్ణ గోపాలస్వామి దేవాలయ ప్రతిష్టాపన...

- ముఖ్య అతిథిగా జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వి. నవీన్ యాదవ్...!
- ప్రతిష్టాపనలో పాల్గొన్న బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆదినారాయణ యాదవ్
- శ్రీకృష్ణ గోపాలస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే వి.నవీన్ యాదవ్...!



**అనంతపురం టౌన్ – సూర్య వాస్తవం :** అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం నియోజకవర్గం కంబదూరు మండలం కురాకులపల్లి గ్రామంలో శ్రీకృష్ణ గోపాలస్వామి దేవాలయ ప్రతిష్టాపన మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ మహోత్సవానికి తెలంగాణ రాష్ట్రం జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వి. నవీన్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు, ముదిగుబ్బ ఎంపీపీ గౌడ్డుమర్రి ఆదినారాయణ యాదవ్, జి.కె. కృష్ణమూర్తి యాదవ్, హైకోర్టు అడ్వకేట్ రమణ యాదవ్, ఎమ్మార్వో మారుతి యాదవ్, సబ్ఇన్స్పెక్టర్ సుధాకర్ యాదవ్, మాజీ సర్పంచ్ చంద్రశేఖర్ యాదవ్, జైపాల్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# నీటి భద్రతపై ప్రభుత్వం అప్రమత్తం కావాలి...!



**అనంతపురం సిటీ – సూర్య వాస్తవం :** రాయలసీమలో కరువు పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని తాగునీటి భద్రత, ఆరుతడి పంటల రక్షణ, పశువుల సంరక్షణకు ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని వైఎస్సార్‌సీపీ రాయలసీమ జోనల్ అధికార ప్రతినిధి కె.వి. రమణ కోరారు. శ్రీశైలం జలాశయంలోని నీటిని సాధ్యమైనంత మేరకు సంరక్షించి, రాయలసీమ అవసరాలకు వినియోగించేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. రైతుల పంటలను కాపాడేందుకు 'లైఫ్ సేవింగ్ ఇరిగేషన్' అందించాలని, తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అన్నారు. ఈ అంశంపై అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు, నీటిపారుదల శాఖ అధికారులతో ప్రభుత్వం సమావేశాలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి, మంత్రులు, ఉన్నతాధికారులు, కలెక్టర్లు, చీఫ్ ఇంజినీర్లు శ్రీశైలం జలాల సంరక్షణ, రాయలసీమ ప్రాజెక్టులకు నీటి లభ్యతపై నిరంతరం పర్యవేక్షణ చేయాలని కోరారు. ప్రజాప్రతినిధులు, సాగునీటి శాఖలను అప్రమత్తం చేయడంతో పాటు రైతులకు నీటి పరిస్థితులపై ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలని సూచించారు. తీవ్ర కరువు పరిస్థితుల్లో రాయలసీమ నీటి సమస్యను రాజకీయ అంశంగా కాకుండా ప్రజా సమస్యగా ప్రభుత్వం పరిగణించాలని రమణ అన్నారు. అన్ని జిల్లాల్లో అన్ని రాజకీయ పార్టీలతో ఐఏబీ సమావేశాలు నిర్వహించి నీటి లభ్యత, పంపిణీపై సమగ్ర కార్యాచరణ రూపొందించాలని కోరారు. శ్రీశైలం జలాశయంలోకి వచ్చే ప్రతి చుక్క నీటినీ రాయలసీమ భవిష్యత్తు కోసం సంరక్షించాలని ఆయన అన్నారు. విద్యుత్ ఉత్పత్తి కోసం నీటిని దిగువకు విడుదల చేసే విషయంలో ప్రభుత్వం అప్రమత్తంగా ఉండాలని, తాగునీరు, పంటలు, పశువుల సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. "నీరు ఉన్నప్పుడే సంరక్షించాలి.. నీరు ఉన్నప్పుడే రాయలసీమను కాపాడాలి. చేతులు కాలాక ఆకులు పట్టుకుంటే వలసలు, ఆత్మహత్యలే మిగులుతాయి" అని కె.వి. రమణ పేర్కొన్నారు.

# గుర్తుతెలియని కారు ఢీకొని పోలీస్ కానిస్టేబుల్ మృతి

- 2009 బ్యాచ్‌కు చెందిన కానిస్టేబుల్ మల్లికార్జున్ దుర్మరణం..
- గుర్తుతెలియని కారు కోసం పోలీసుల గాలింపు..

**అనంతపురం క్రైమ్ – సూర్య వాస్తవం :** రమణేపల్లి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో 2009 బ్యాచ్‌కు చెందిన పోలీస్ కానిస్టేబుల్ మల్లికార్జున్ మృతి చెందారు. రహదారిపై వెళ్తున్న ఆయనను గుర్తు తెలియని కారు ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందినట్లు సమాచారం. ప్రమాదం అనంతరం కారు అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు తెలుస్తోంది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి ప్రమాదానికి కారణమైన వాహనాన్ని గుర్తించేందుకు దర్యాప్తు చేపట్టారు. మృతుడు మల్లికార్జున్ పోలీస్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నట్లు సమాచారం. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు, ఘటనకు గల కారణాలు పోలీసుల దర్యాప్తులో వెల్లడికావాల్సి ఉంది.





# కనేకల్‌లో నకిలీగాళ్లు...!



- 1967లో మరణించిన వ్యక్తి.... 2026 లో మరణించినట్టు డెత్ సర్టిఫికెట్...
- "చెప్పుతో కొడతానన్నారు" అంటూ అధికారిపై నిందా!
- ఆస్తి కోసం ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ ఆట?

**కణేకల్ – సూర్య వాస్తవం:**

నకిలీ మరణ ధ్రువీకరణ పత్రంతో ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ పొందేందుకు దరఖాస్తు చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు కనేకల్ మండల తహసీల్దార్ బ్రహ్మయ్య తెలిపారు. గురువారం సాయంత్రం కనేకల్ తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ వివరాలను వెల్లడించారు కనేకల్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులు ఆస్తి సంబంధిత వ్యవహారం కోసం ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ కావాలని దరఖాస్తు చేసుకున్నారని తహసీల్దార్ తెలిపారు. దరఖాస్తుల పరిశీలనలో భాగంగా సమర్పించిన ధ్రువపత్రాలను అధికారులు సంబంధిత రికార్డులతో వెరిఫికేషన్ చేయగా పలు విరుద్ధ వివరాలు వెలుగులోకి వచ్చినట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా 1967లో మరణించిన వ్యక్తి 2026 నమోదు పేరుతో సమర్పించిన మరణ ధ్రువీకరణ పత్రంపై అధికారులకు అనుమానం కలిగిందన్నారు. ప్రాథమిక విచారణలో సదరు వ్యక్తి కనేకల్ మండలంలోనే మరణించినట్లు ప్రాథమిక విచారణ లో బయటపడగా, సమర్పించిన మరణ ధ్రువీకరణ పత్రంలో మాత్రం అనంతపురంలో మరణించినట్లు నమోదు అయి ఉన్నట్లు తెలిపారు. ఆ ధృవీకరణ పత్రం అనంతపురం జి జి హెచ్ అధికారులకు పంపగా తమ రికార్డులో ఈ మరణ ధ్రువీకరణ పత్రం లేదు అని ధ్రువీకరించారు దీంతో ఆ ధ్రువపత్రం నకిలీదిగా గుర్తించినట్లు తహసీల్దార్ వెల్లడించారు. అయితే తాను సమర్పించిన ధ్రువపత్రాలన్నీ అసలైనవేనని దరఖాస్తుదారుడు పేర్కొంటూ అనంతపురం కలెక్టర్ కార్యాలయంలోని పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేసినట్లు బ్రహ్మయ్య తెలిపారు. ధ్రువపత్రాల్లో ఫోర్జరీ ఉందని అధికారులు చెబుతున్నారని, ఒక అధికారి తనను చెప్పుతో కొడతానని బెదిరించారని ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు. ఈ వ్యవహారంపై కనేకల్ తహసీల్దార్ కార్యాలయ అధికారులు సమగ్రంగా పరిశీలన చేపట్టి, దరఖాస్తుదారుడు సమర్పించిన ధ్రువపత్రాలను నకిలీవిగా గుర్తించినట్లు తహసీల్దార్ చెప్పారు. సంబంధిత వ్యక్తిపై కేసు నమోదు చేసి, తదుపరి చర్యల కోసం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని వెల్లడించారు. ధ్రువపత్రాల నిజానిజాలపై పూర్తిస్థాయి విచారణ జరిగితే ఈ వ్యవహారానికి సంబంధించి మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ జారీ చేయలేదనే కారణంతో సంబంధిత అధికారిపై అసభ్యకరమైన ఆరోపణలు చేయడం సరికాదని తహసీల్దార్ బ్రహ్మయ్య పేర్కొన్నారు.



# వివక్షలేని సమాజం కోసం సామాజిక శంఖారావం

- కులవృక్షత అంటరానితనం రూపుమాపాలి : కెవి పిఎస్



**గుత్తి – సూర్య వాస్తవం :** గుత్తి ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో 19 నుండి 21వ తేదీ వరకు జరుగుతున్న జీపు యాత్ర గురువారం రెండవ రోజు అనంతపురం నుండి గార్లదిన్నె సింగనమల పెద్దవడుగూరు మండలాల నుండి గుత్తికి చేరుకోవడం జరిగింది. ఈ సందర్భంగా కెవిపియస్ మండల కార్యదర్శి మల్లికార్జున అధ్యక్షత వహించగా ముఖ్య ఆహ్వానితులు గా కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ నల్లప్ప,వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం కృష్ణ మూర్తి,మాట్లాడుతూ గ్రామీణ ప్రాం తాల్లో నేటికీ కులవేక్షత గ్రామాలలో ఉన్నదని దేవాలయ ప్రవేశాలు దళి తుల పెళ్లిళ్లు ఊరేగింపులు వినాయ క చవితి పండుగ సందర్భంగా ఊరేగింపులు గ్రామమంతా దళితులను తిరుగనివ్వర న్నారు. ఇంటి స్థలం ఇ ల్లు లేని వారు నేటికి నూటికి 50 మంది వరకు ఉన్నారన్నారు. సొంత భూముల లేక వ్యవసాయ కార్మికు లు కౌలు రైతులు గాను వలస కార్మి కులు గానూ జీవిస్తున్నారన్నారు. గ్రా మాలలో చేతి నిండా పని లేక పనికి తగ్గ కూలి రాక ఇతర పట్టణాలకు వ లసలు పోయి జీవిస్తున్నారన్నారు. వ్యవసాయ కూలీలకు ఉదయం నుంచి సాయంకాలం నాలుగు గంటల వరకు పనిచేసిన మహిళలకు 25 0 రూపాయలు మాత్రమే కూలి ఇస్తున్నారని ఇప్పటికైనా దళిత కాల నీలలో స్థానిక సమస్యలు మంచినీ టి సౌకర్యాలు మౌలిక సదుపాయా లు కల్పించాలని ఈ నెల 24వ తేదీ న అనంతపురం కలెక్టర్ ఆఫీస్ ముం దు జరిగే ధర్నా కార్యక్రమాన్ని జయ ప్రదం చేయాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు వ్య వసాయ కార్మిక సంఘం జిల్లా ఉపా ధ్యక్షులు సూరి ప్రధానాట్య మండలి జిల్లా ప్రధాన కార్యదర్శి వన్నూరప్ప గుత్తి నుండి సిఐటియు జిల్లా నాయ కులు నిర్మల,రమేష్,వ్యవసాయ కా ర్మిక సంఘం మండల కార్యదర్శి మ ల్లేష్,మహిళా సంఘం మండల కా ర్యదర్శి రేణుక అధ్యక్షులు రేవతి మున్సిపల్ పారిశుద్ధ కార్మికులయూ నియన్ మండల అధ్యక్షుడు సూరి ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి నవీన్ యాదవ్,వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు చందు,ఉపాధ్య క్షులు వన్నూరమ్మ,ఊర్మిళ తదితరు లు పాల్గొన్నారు.

# వైభవంగా అంజనమ్మ మనవడి వివాహ రిసెప్షన్ వేడుక...!

- నూతన వధూవరులను ఆశీర్వదించిన సీనియర్ జర్నలిస్ట్ డి.ఎల్.గణేష్ బాబు.

**అనంతపురం టౌన్ – సూర్య వాస్తవం:** అనంతపురం పట్టణంలోని ఎం.వై.ఆర్. ఫంక్షన్ హాల్‌లో గురువారం నిఖిల్ సాయి, రూపశ్రీ వివాహ రిసెప్షన్ వేడుకను ఘనంగా నిర్వహించారు. ఇరు కుటుంబాల పెద్దలు, బంధుమిత్రుల సమక్షంలో వివాహ వేడుకలు శాస్త్రోక్తంగా జరిగాయి.

ఈ శుభకార్యానికి మేనమామ, సీనియర్ జర్నలిస్ట్ డి.ఎల్. గణేష్ బాబు ముఖ్య అతిథిగా హాజరై నూతన వధూవరులను ప్రత్యేకంగా అభినందించారు. నూతన దంపతులు జీవితాంతం సుఖసంతోషాలతో, అన్యోన్యంగా జీవించాలని ఆకాంక్షిస్తూ వారికి హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెళ్లికొడుకు తల్లిదండ్రులు రిటైర్డ్ హెడ్‌మాస్టర్ అన్నేపల్లి నాగరాజు, డి.ఎల్. విజయలక్ష్మి, కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు తదితరులు పాల్గొన్నారు.



# తాగు నీటి సమస్య

- నెల రోజులుగా తాగు నీటి సమస్యతో ఇబ్బంది పడుతున్న 150 కుటుంబాలు
- జనరల్ ఫండ్స్ వచ్చేవరకు పరిష్కరించలేమంటున్న అధికారులు



**పామిడి – సూర్య వాస్తవం :** పామిడి పట్టణంలోని పదవ వార్డు బూజు గరిడి వీధిలో ఉన్న మినీ ట్యాంకరుకు సరఫరా చేసే మోటర్ పంప్ చెడిపోయినందువలన రెండు నెలలుగా త్రాగునీరు లేక దాదాపు 150 కుటుంబాలు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఈ విషయాన్ని పంచాయతీ కార్యాలయం అధికారి దృష్టికి తీసుకుని పోగా ప్రస్తుతం పంచాయతీ బోర్డులో నిధులు లేవని జనరల్ ఫండ్స్ వచ్చిన తర్వాత మోటర్ పంప్ రిపేర్ చేపిస్తామని సమాధానం ఇచ్చినట్లు కాలనీ వాసులు ఆవేదన వ్యక్తపరిచారు. జనరల్ పడ్స్ వచ్చేటప్పుడు మా సమస్య తీరేది ఎప్పుడని, అధికారులు ఇచ్చే సమాధానం విడ్డూరంగా ఉందని ప్రజలు తత్ర్యఆగ్రహం వ్యక్తపరుస్తున్నారు. జిల్లా అధికారులైనా చర్యలు తీసుకొని తక్షణం పరిష్కరించి త్రాగునీటి సమస్య తీర్చాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## సూళ్లూరుపేట నియోజకవర్గంలో కిడ్నీ డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేయాలి

**- ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయ శ్రీ"**



**దొరవారిసత్రం - సూర్య వాస్తవం :** సూళ్లూరుపేట నియోజకవర్గంలో కిడ్నీ డయాలసిస్ సెంటర్ ను ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఆరోగ్య శాఖ మంత్రి వై.సత్యకుమార్ లను కోరారు.గురువారం జరిగిన అసెంబ్లీ సమావేశం పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి విజయ వంతంగా అమలు చేయడం జరుగు తుందన్నారు. అలాగే విద్యా, వైద్యానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు.ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడంతో పాటు ఇన్ పేషెంట్లకు భోజన వసతి కల్పించడం ద్వారా వైద్యాన్ని అందుబాటులోకి తీసుకురావడం జరుగుతుందన్నారు. ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా,సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా నిరుపేద రోగులకు ఎంతో ఆర్థిక వెసులుబాటు కలుగుతుందని తెలియజేశారు.పేద ప్రజల ఆరోగ్యాల మెరుగు పరిచేందుకు ప్రాధాన్యత విస్తున్న సీఎం చంద్రబాబు,ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ కు కృతజ్ఞతలు తెలియజేశారు. కాగా ఉప్పునీటి సరస్సు అయిన పులికాట్ కు ఆనుకుని ఉన్న సూళ్లూరుపేట నియోజకవర్గంలో ప్రభుత్వ లెక్కల ప్రకారం 185 మంది కిడ్నీ పేషెంట్లు డయాలసిస్ చేయించుకుంటున్నట్లు తెలిపారు. తమ ప్రాంతంలో డయాలసిస్ సెంటర్ లేకపోవడం వలన కిడ్నీ పేషెంట్లు నెల్లూరు,తిరుపతి,చెన్నై నగరాలకు సుమారు వంద కిలోమీటర్ల దూరం వ్యయ ప్రయాసలతో ప్రయాణం చేయవలసి వస్తుందని అన్నారు. సూళ్లూరుపేట నియోజకవర్గంలో ఒక కిడ్నీ డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేసినట్లయితే వారిని ఆదుకున్నట్లు అవుతుందని తెలియజేశారు. అలాగే కార్డియాక్ అరెస్ట్ కేసులను తగ్గించడం కోసం రాష్ట్రవ్యాప్తంగా సిపిఆర్ పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలియజేశారు.

## పారదర్శక ఓటర్ల జాబితాయే లక్ష్యం

**- ప్రజల సమస్యలపై స్పందించిన తహశీల్దార్ రాజేంద్ర- అక్కరపాక, సూరాపుఅగ్రహారంలో క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టిన తహశీల్దార్ రాజేంద్ర - ప్రజల సమక్షంలోనే దరఖాస్తులు,అభ్యంతరాల స్వీకరణ**

**- అర్హులందరికీ ఓటు హక్కు కల్పించడమే ధ్యేయమని స్పష్టీకరణ**



**దొరవారిసత్రం - సూర్య వాస్తవం :** పక్కా ఓటర్ల జాబితా రూపకల్పనే లక్ష్యంగా దొరవారిసత్రం తహశీల్దార్ రాజేంద్ర సమర్థ వంతంగా అడుగులు వేస్తున్నారు. మండల పరిధిలోని అక్కం˘పాక, సూరాపు అగ్రహారం గ్రామాల్లో ఓటర్ల జాబితాకు సంబం ధించి వచ్చిన దరఖాస్తులు, మార్పులు-చేర్పులు సవరణలపై ఆయన గురువారం స్వయంగా క్షేత్రస్థాయికి వెళ్లి ప్రజా సమస్యలను నేరుగా విచారించారు. అక్కరపాక పోలింగ్ స్టేషన్ నెం.176,సూరాపుఅగ్రహారం పోలింగ్ స్టేషన్ నెం.179 పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో నిర్వహించిన"అనోమలీస్ హియరింగ్" కార్యక్రమంలో తహశీల్దార్ రాజేంద్ర పాల్గొన్నారు. ప్రజల సమక్షంలోనే స్థానికుల నుంచి వినతులు, అభ్యంతరాలను స్వీకరించి,వాటి సవరణ ప్రక్రియను వేగవంతం చేశారు.అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కుకలిపించాలని.ఈ సందర్భంగా తహశీల్దార్ రాజేంద్ర మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో ఎటువంటి తప్పులు లేకుండా,ప్రజాస్వామ్యంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే తమ ప్రధాన ప్రాధాన్యత అని స్పష్టం చేశారు.నమోదైన వ్యత్యాసాలను,అభ్యంతరాలను నిబంధనల ప్రకారం వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. క్షేత్రస్థాయిలో బిఎల్ఓలను నిరంతరం సమన్వయం చేసుకుంటూ,ప్రజలకు రెవెన్యూ సేవలను సులభతరం చేసేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.ప్రజలకు అందుబాటులో ఉంటూ, సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తున్న తహశీల్దార్ రాజేంద్ర పనితీరు పట్ల స్థానిక ప్రజలు,ఓటర్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక రెవెన్యూ అధికారులు, బిఎల్ఓలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ వృత్తి విద్యా జూనియర్ కళాశాలలో ఘనంగా వరలక్ష్మీ వ్రతం



**దొరవారిసత్రం - సూర్య వాస్తవం :** కర్నూలు ప్రభుత్వ వృత్తి విద్యా జూనియర్ కళాశాలలో శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని వరలక్ష్మీ వ్రత కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో, సాంప్రదాయబద్ధంగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల మహిళా సిబ్బంది అందరూ కుటుంబాల్లో సుఖసంతోషాలు, ఆరోగ్యం, ఐశ్వర్యం, శ్రేయస్సు కలగాలని, అలాగే కళాశాల మరింత అభివృద్ధి చెందాలని అమ్మవారిని ప్రార్థించారు. వరలక్ష్మీ వ్రతం ప్రాధాన్యతను వివరిస్తూ, భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు మరియు ఆధ్యాత్మిక విలువలను భావితరాలకు అందించడంలో ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ముఖ్యమైనవని కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు.ఈ సందర్భంగా కళాశాలలో విధులు నిర్వహిస్తున్న మహిళా సిబ్బంది అందరినీ ప్రత్యేకంగా సన్మానించి, పసుపు, కుంకుమ, పూలు,తాంబూలం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. మహిళా సిబ్బందిని గౌరవించడం ద్వారా వారి సేవలను,కళాశాల అభివృద్ధిలో వారి పాత్రను గుర్తించినట్లవుతుందని పేర్కొన్నారు. అలాగే మహిళలు కుటుంబ బాధ్యతలతో పాటు విద్యా రంగంలో కూడా కీలక పాత్ర పోషిస్తూ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో చేస్తున్న కృషిని అభినందించారు. కార్యక్రమం అనంతరం మహిళా సిబ్బంది పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకుని, కార్యక్రమం, ఆనందోత్సాహాల మధ్య విజయవంతంగా ముగిసింది.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రిన్సిపాల్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ఎస్.నాగ స్వామి నాయక్, అధ్యాపకులు, మహిళా సిబ్బంది, అధ్యాపకేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు, చిన్నారుల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యత...!

**- శక్తి టీమ్స్ క్షేత్రస్థాయిలో మరింత చురుగ్గా పనిచేయాలి**
**- పాఠశాలలు, రైల్వే స్టేషన్లు, బస్‌స్టాండ్లలో నిరంతర అవగాహన కార్యక్రమాలు**
**- శక్తి టీమ్స్ క్షేత్రస్థాయిలో మరింత చురుగ్గా పనిచేయాలి : జిల్లా అదనపు ఎస్పీ మహబూబ్ బాషు...!**



**చిత్తూరు క్రైమ్ - సూర్య వాస్తవం :** మహిళలు, బాలికలు, చిన్నారుల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ శక్తి టీమ్స్ క్షేత్రస్థాయిలో మరింత చురుగ్గా పనిచేయాలని చిత్తూరు జిల్లా అదనపు ఎస్పీ (పరిపాలన) మహబూబ్ బాష సూచించారు. జిల్లా ఎస్పీ తుషార్ డూడి, ఐపీఎస్ ఆదేశాల మేరకు చిత్తూరు మహిళా పోలీస్ స్టేషన్‌లో జిల్లా శక్తి టీమ్స్‌తో సమీక్షా సమావేశం నిర్వహించారు. మహిళా పోలీస్ డీఎస్పీ శ్రీనివాసరావు సమక్షంలో జరిగిన ఈ సమావేశంలో మహిళలు, బాలికలు, చిన్నారుల భద్రతకు తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ పాఠశాలలు, రైల్వే స్టేషన్లు, ఆర్టీసీ బస్‌స్టాండ్లు, ఇతర రద్దీ ప్రాంతాల్లో నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో మహిళలు పోలీసుల సహాయం పొందేందుకు శక్తి యాప్‌లోని అత్యవసర సహాయ సౌకర్యాన్ని వినియోగించుకునే విధానంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

**బాలికల భద్రతపై ప్రత్యేక దృష్టి**

మహిళలు, బాలికలకు సంబంధించిన గల్లంతు, ఇంటి నుంచి వెళ్లిపోయిన ఘటనలపై ప్రత్యేక దృష్టి సారించాలని మహబూబ్ బాష ఆదేశించారు. బాలికలకు సంబంధించిన ప్రతి ఫిర్యాదును సున్నితంగా పరిగణించి, సంబంధిత శాఖల సమన్వయంతో తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. మహిళలను వేధించే వారిపై, ఈవ్‌టీజింగ్‌కు పాల్పడే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు.

**అత్యాచారం, పోక్సో కేసుల్లో వేగంగా చర్యలు**

అత్యాచారం, పోక్సో కేసుల్లో చట్టపరమైన నిబంధనల ప్రకారం తక్షణ చర్యలు తీసుకోవాలని అదనపు ఎస్పీ సూచించారు. బాల్య వివాహాలను అరికట్టేందుకు క్షేత్రస్థాయిలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, అనుమానాస్పద పరిస్థితులను ముందుగానే గుర్తించాలన్నారు. పాఠశాలల్లో చిన్నారులకు మంచి స్పర్శ, చెడు స్పర్శపై అవగాహన కల్పించాలని సూచించారు. పిల్లలపై వేధింపులు లేదా దుర్వినియోగం జరిగినప్పుడు 1098 బాలల సహాయవాణిని సంప్రదించేలా విద్యార్థులు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు.

**ఆడపిల్లల రక్షణపై అవగాహన**

ఆడపిల్లల రక్షణ, విద్య ప్రాధాన్యతపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు 'బేటీ బచావో' కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని తెలిపారు. పాఠశాలకు వెళ్లకుండా చదువు మధ్యలోనే మానేసిన పిల్లలను గుర్తించి, వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి తిరిగి పాఠశాలకు పంపించేలా సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకోవాలని సూచించారు.

**మాదకద్రవ్యాలు, సైబర్ మోసాలపై అవగాహన**

యువతను మాదకద్రవ్యాలకు దూరంగా ఉంచేందుకు విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అదనపు ఎస్పీ తెలిపారు. మాదకద్రవ్యాలకు సంబంధించిన సమాచారాన్ని అధికారులకు తెలియజేసేందుకు అందుబాటులో ఉన్న 1972 హెల్ప్‌లైన్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సైబర్ మోసాలకు గురైన వెంటనే ఆలస్యం చేయకుండా 1930 సైబర్ నేరాల సహాయవాణికి ఫిర్యాదు చేసేలా ప్రజలకు తెలియజేయాలని సూచించారు.

**మహిళల సమస్యల పరిష్కారానికి సమన్వయం**

మహిళల సమస్యలు, వేధింపులకు సంబంధించి సహాయం కోసం 181 మహిళా సహాయవాణి గురించి ప్రజలకు తెలియజేయాలని సూచించారు. మహిళలకు అందుబాటులో ఉన్న న్యాయ సహాయం, కౌన్సెలింగ్, ఇతర సేవలపై అవగాహన కల్పించాలన్నారు. డ్వాక్రా మహిళలకు మహిళల భద్రత, చట్టపరమైన హక్కులు, సహాయవాణులు, స్థానిక మహిళా భద్రతా సేవలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు.

**భిక్షాటన చేస్తున్న పిల్లలపై ప్రత్యేక దృష్టి**

వీధి కూడళ్లలో భిక్షాటన చేస్తున్న పిల్లలు, మహిళలను గుర్తించి వారి పరిస్థితులను పరిశీలించాలని అదనపు ఎస్పీ తెలిపారు. సంబంధిత శాఖల సహకారంతో వారికి అవసరమైన రక్షణ, సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.
శక్తి టీమ్స్ కేవలం అవగాహన కార్యక్రమాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో మహిళలు, బాలికలు, చిన్నారులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించాలని మహబూబ్ బాష సూచించారు. అవసరమైన సందర్భాల్లో పోలీస్, విద్య, సంక్షేమ తదితర శాఖలతో సమన్వయం చేసుకుని సమస్యలకు పరిష్కారం చూపాలన్నారు. మహిళలు, బాలికలు, చిన్నారుల భద్రతకు సంబంధించిన ప్రతి కార్యక్రమాన్ని బాధ్యతతో నిర్వహించి ప్రజల్లో భద్రతా భావాన్ని పెంపొందించేలా శక్తి టీమ్స్ పనిచేయాలని అదనపు ఎస్పీ మహబూబ్ బాష దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో మహిళా పోలీస్ డీఎస్పీ శ్రీనివాసరావు, మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ మోహన్, జిల్లా శక్తి టీమ్స్ సిబ్బంది పాల్గొన్నారు.



## గ్రామాల్లో విస్తృతంగా "పల్లె నిద్ర"కార్యక్రమాలు

**- గ్రామీణ ప్రాంతాల్లో పోలీసుల ముమ్మర పర్యటనలు -ప్రజలతో నేరుగా మమేకం.**
**- గంజాయి, సైబర్ నేరాలు, మహిళలు - చిన్నారుల భద్రతపై అవగాహన.**
**- శక్తి యాప్ వినియోగం, బాల్య వివాహాల నివారణపై ప్రజలకు అవగాహన.**
**- స్థానిక సమస్యలపై ఆరా -ప్రజలకు అవసరమైన సూచనలు.**



**దొరవారిసత్రం - సూర్య వాస్తవం :** తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు, ఐపీఎస్.ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా పోలీసు అధికారులు తమ పరిధిలోని గ్రామాలను విస్తృతంగా సందర్శిస్తూ"పల్లె నిద్ర' 'కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ప్రజలతో నేరుగా మమేకమై వారి సమస్యలను తెలుసుకోవడంతో పాటు,నేటి సమాజంలో జరుగు తున్న వివిధ నేరాలు, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నారు.యెర్పేడు పోలీస్ స్టేషన్ పరిధిలోని పాపానాయుడుపేట గ్రామంలో శ్రీ ద్రౌపతీ సమేత ధర్మరాజు స్వామి వారి 156వ బ్రహ్మోత్సవాలను పురస్కరించు కుని రేణిగుంట ఎస్‌డిపిఒ ఆధ్వర్యంలో "పల్లె నిద్ర" కార్యక్రమం, సమీక్ష సమావేశం నిర్వహించారు. ఏర్పేడు సీఐ,ఆలయ ధర్మ కర్తలు, ఆలయ కమిటీ సభ్యులతో కలిసి బ్రహ్మోత్సవాల సందర్భంగా చేపట్టాల్సిన బందోబస్తు, భక్తుల రద్దీ నియంత్రణ, ట్రాఫిక్ నిర్వహణ,ఇతర భద్రతా ఏర్పాట్లను సమీక్షించి, అవసరమైన సూచనలు చేశారు. అలాగే గ్రామంలోని స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు.



మహిళలు చిన్నారులపై జరిగే నేరాల నివారణ,బాల్య వివాహాల దుష్ప రిణా మాలు, రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు ప్రజలు ఎలాంటి నేరాలకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలు కనిపించినప్పుడు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ప్రజలతో నేరుగా మమేకమై వారి సమస్యలను తెలుసుకోవడం,నేరాల నివారణపై అవగాహన కల్పించడం, గ్రామీణ ప్రాంతాల్లో భద్రతను మరింత బలోపేతం చేయడమే" పల్లె నిద్ర" కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని జిల్లా పోలీసులు వెల్లడించారు.

## నారాయణ పాఠశాలలో ముందస్తు వరలక్ష్మి వ్రత వేడుకలు



**కదిరి - సూర్య వాస్తవం:** పట్టణంలోని నారాయణ పాఠశాలలో వరలక్ష్మి వ్రతం ముందస్తుగా వేడుకలను ఘనంగా నిర్వహించారు, గురువారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి నారాయణ పాఠశాలల ఆర్ అండ్ డి, ఋఖ్యఅతిథిగా విచ్చేసి పూజా కార్యక్రమాలను నిర్వ హించారు, అనంతరం నారాయణ పాఠశాలలో ఏజియం, పటాన్ సర్ఫ్ రాజ్ ఖాన్ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమం అమ్మవారి ప్రతిమతో పాటు విశేషమైన సాంప్రదాయ బద్దంగా పూజా కార్యక్రమాలను పెద్ద ఎత్తున ఏర్పాటు చేశారు, ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు సాంప్రదాయ దుస్తులను ధరించి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులకు వరలక్ష్మీ వ్రతం విశిష్టత గురించి, వాటి ప్రత్యేకతను తెలియజేస్తూ తర్ఫీ దును ఇస్తున్నామని పేర్కొన్నారు, విద్యార్థిని విద్యార్థులకు విద్యతో పాటు సాంస్కృతిక , సాంప్రదాయ, సామాజిక, క్రీడా,ఆర్థిక రంగాలతో పాటు, ఆధునిక విద్య ను అభ్యసిస్తున్నామని తెలిపారు. అనంతరం విద్యార్థిని విద్యార్థులకు సాంప్రదాయ దుస్తుల ఎంపిక ను నిర్వహించి వారికి ప్రశంసించారు, ఈ కార్యక్రమంలో పాఠశాల అకాడమిక్ డీన్ జి విష్ణువర్ధన్ రెడ్డి, ఏ,ఓ ,ఐక్రియ, హై స్కూల్ వైస్ ప్రిన్సిపల్ కుమార్, ఈ ఛాంప్స్ వైస్ ప్రిన్సిపల్ నియా మత్, ఈ కిడ్స్ ప్రిన్సిపల్ రాసినేని హరిత, సారా, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# భారతదేశ ఆధునీకరణలో ముఖ్య పాత్ర పోషించిన స్వర్గీయ ప్రధాని రాజీవ్ గాంధీ

**--రాయచోటిలో ఘనంగా స్వర్గీయ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు**
**--డిసిసి అడ్మిన్, రాయచోటి నియోజవర్గం ఇన్‌చార్జిఆర్ అమీర్ భాష**



**రాయచోటి-సూర్య వాస్తవం:** భారత తొలి ప్రధానమంత్రి జవహర్ లాల్ నెహ్రూ కుమార్తె భారతదేశ తొలి మహిళా ప్రధానమంత్రి ఇందిరాగాంధీ కుమారుడు భారత దేశ ఆధునీకరణలో ముఖ్యపాత్ర పోషించిన స్వర్గీయ దేశ ప్రధాని రాజీవ్ గాంధీ అని అన్నమయ్య డిసిసి అడ్మిన్, కాంగ్రెస్ పార్టీ రాయచోటి నియోజకవర్గం ఇన్ చార్జి ఆర్. అమిర్ భాష అన్నారు. గురువారం పట్టణంలోని డిసిసి కార్యాలయంలో రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా కేక్ కట్ చేసి ఒకరికొకరు తినిపించుకొని వేడుకలను కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, కార్యకర్తల మధ్య ఆయన ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1984లో ఇందిరా గాంధీ హత్య అనంతరం రాజీవ్ గాంధీ భారత ప్రధాన మంత్రిగా బాధ్యతలు స్వీకరించారని అదే సంవత్సరం జరిగిన



సాధారణ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ భారీ మెజార్టీతో విజయం సాధించిందని గుర్తు చేశారు.భారత దేశ చరిత్రలో అత్యంత యువ ప్రధానమంత్రిగా ఆయన నిలిచారని చెప్పారు. భారతదేశంలో కంప్యూటర్లు, టెలి కమ్యూనికేషన్ సాంకేతికత వినియోగాన్ని విస్తరించడంలో రాజీవ్ గాంధీ కీలక పాత్ర పోషించారని విస్తృతంగా గుర్తించ పడుతుంది. భవిష్యత్ ఆర్థిక అభివృద్ధికి సాంకేతికత ప్రధాన సాధనమని ఆయన విశ్వసించారని కొనియాడారు. రాబోయే రోజుల్లో రాజీవ్ గాంధీ కుమారుడు కాంగ్రెస్ పార్టీ అగ్ర




నాయకుడు ఎంపీ రాహుల్ గాంధీ భారత దేశ ప్రధాని అవుతారని, సుపరిపాలన అందిస్తారని ఆయన ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీ వైస్ ప్రెసిడెంట్ అమీర్ బాష, జెనరల్ సెక్రటరీ సయ్యద్ సమీరుద్దీన్, టౌన్ ప్రెసిడెంట్ సర్దార్ బాబా, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు అజాంతుల్లా, ఖాదర్ ఖాన్, షబ్బీర్, నూరుల్లా, మహమ్మద్ రఫీ, షేక్ ఖాజా, స్వనజరెడ్డి, బేబీ నిషాల్, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

# టెట్ పరీక్షను రద్దు చేయాలి

**-ఎస్టియు అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు అంకం శివారెడ్డి**



**రాయచోటి - సూర్య వాస్తవం:** సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహిస్తున్న టెట్ పరీక్షను రద్దు చేయాలని ఎస్‌టియు అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు అంకం శివారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. రాయచోటి మండలంలో సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ప్రత్యేక అతిథిగా పాల్గొన్న ఆయన దృష్టికి పలువురు ఉపాధ్యాయులు టెట్ అంశాన్ని అందులో ఉన్న ఇబ్బందులను తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టం అమలు ప్రారంభమైనప్పటి నుండి కాకుండా 30,35 సంవత్సరాలు సర్వీస్ కలిగిన వయసు పైబడిన ఉపాధ్యాయులు కూడా టెట్ రాయాలని చెప్పడం సరైనది కాదని అన్నారు. దీనిని ఏపీ ప్రభుత్వమే కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి చట్ట సవరణ చేయించే బాధ్యత తీసుకోవాలని అన్నారు. విద్య హక్కు చట్టం 2010 ఆగస్టు నుంచి దాదాపు 15 సంవత్సరాలపాటు ప్రాస్పెక్టివ్గా అమలు అయ్యి ( ఆనాటి నుంచే) ఈరోజు చట్టంలో స్పష్టత లేదనే సాకుతో 20 -30 ఏళ్ల బోధనా అనుభవం ఉన్నప్పటికీ ఉపాధ్యాయ బోధనా ప్రమాణాల కారణంతో 2010 కంటే ముందు నుంచి కూడా చట్టాన్ని అమలు చేయాలని ఉపాధ్యాయులంతా టెట్ (టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్) పాస్ అవ్వాలనే నిర్ణయం దాదాపు రాష్ట్రంలో 80,000 వేల మంది ఉపాధ్యాయుల మానసిక వ్యధకు లోన్ అవుతూ తాను బోధించే సబ్జెక్టులు కాక ఇతర సబ్జెక్టులు చదవలేక, చదివేందుకు సమయం లేక, చదివింది అర్థం చేసుకున్నది వయసు ప్రభావం వలన గుర్తు ఉండక మనోవేదనకు గురవుతున్నారని కావున ప్రభుత్వం ఉపాధ్యాయులకు ఉన్నటువంటి ఇబ్బందిని అర్థం చేసుకుని టెట్ పరీక్షలు రద్దు చేయాలని ఆయన కోరారు ఈ కార్యక్రమంలో ఎస్టియు రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ కన్వీనర్ వై రవీంద్రనాథ్ రెడ్డి అన్నమయ్య జిల్లా ఉపాధ్యక్షులు సయ్యద్ సునీర్, రాయచోటి అర్బన్ అధ్యక్షులు రహిమాన్ మహమ్మద్ ఇలియాస్ సీనియర్ నాయకులు శంకర్ రెడ్డి, వాసుదేవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# 16శాతం హెచ్‌ఆర్‌ఏను యథావిధిగా కొనసాగించాలి

**- ఉద్యోగ సంఘాల ఐక్యవేదిక డిమాండ్**



**అన్నమయ్య బ్యూరో- సూర్య వాస్తవం:** రాయచోటి గ్రేడ్-1 మున్సిపాలిటీ పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగులకు ప్రస్తుతం అమలులో ఉన్న 16% హెచ్‌ఆర్‌ఏను యథావిధిగా కొనసాగించాలని రాయచోటి నియోజకవర్గ ఉద్యోగ సంఘాల ఐక్యవేదిక ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఇటీవల అన్నమయ్య జిల్లా కేంద్రాన్ని రాయచోటి నుంచి మదనపల్లెకు మార్చిన నేపథ్యంలో, రాయచోటి గ్రేడ్-1 మున్సిపాలిటీ పరిధిలోని ఉద్యోగులకు అమలవుతున్న 16శాతం హెచ్‌ఆర్‌ఏను తొలగించే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు సమాచారం రావడంతో ఉద్యోగుల్లో ఆందోళన నెలకొంది. ఇప్పటికే జిల్లా కేంద్రాన్ని కోల్పోయిన రాయచోటి ఉద్యోగులు 16శాతం హెచ్‌ఆర్‌ఏను కూడా కోల్పోతే ఆర్థికంగా మరింత నష్టపోవడంతో పాటు, ఉద్యోగుల్లో తీవ్ర నిరాశ నెలకొంటుందని ఐక్యవేదిక నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో రాయచోటి జిల్లా కేంద్రంగా ఉన్న సమయంలో ప్రభుత్వం +.నా.వీం.చీశీ.69 జారీ చేసి, రాయచోటి గ్రేడ్-1 మున్సిపాలిటీ పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగులకు 16శాతం హెచ్‌ఆర్‌ఏను మంజూరు చేసిందని వారు గుర్తు చేశారు. ఈ హెచ్‌ఆర్‌ఏను కేవలం జిల్లా కేంద్రం హోదాతో ముడిపెట్టకుండా, రాయచోటి గ్రేడ్-1 మున్సిపాలిటీకి ప్రత్యేకంగా యథావిధిగా కొనసాగించాలని వారు కోరారు. ప్రభుత్వ పెద్దలు ఈ అంశంపై సానుకూల దృక్పథంతో, సహృదయంతో స్పందించి, రాయచోటి ఉద్యోగుల మనోభావాలను గౌరవిస్తూ 16శాతం హెచ్‌ఆర్‌ఏను కొనసాగించాలని ఐక్యవేదిక నాయకులు విజ్ఞప్తి చేశారు. అనంతరం రాయచోటి నియోజకవర్గ ఉద్యోగ సంఘాల ఐక్యవేదిక కన్వీనింగ్ కమిటీని ఎన్నుకున్నారు.ఐక్యవేదిక గౌరవ సలహాదారుగా కొండూరు శ్రీనివాసరాజు, కన్వీనర్‌గా షేక్ జాబీర్, కో-కన్వీనర్లుగా అబ్బవరం హరిబాబు, అంకం శివారెడ్డి, మడితాటి నరసింహారెడ్డి, మడితాటి వేణుగోపాల్ రెడ్డి, సుంకర రామక్రిష్ణ,కార్యదర్శులుగా పల్లం రామచంద్ర, వల్లూరి ఇలియాస్ భాష, ఎన్. రామాంజులు, ఎస్. జఫ్ఫారుద్దీన్, పి. సిద్దయ్య, పి. రెడ్డప్ప రెడ్డి, పి. గఫార్ ఖాన్ తదితరులను ఎన్నుకున్నారు. 16శాతం హెచ్‌ఆర్‌ఏను కొనసాగించే వరకు దశలవారీగా ఉద్యమ కార్యక్రమాలను చేపడతామని ఉద్యోగ సంఘాల ఐక్యవేదిక నాయకులు ప్రకటించారు.

# అమరావతిలో రాష్ట్ర మంత్రులను, కలిసిన రాయచోటి బిజెపి నాయకులు



**అన్నమయ్య బ్యూరో - సూర్య వాస్తవం:** రాష్ట్ర రవాణా శాఖ, యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిని బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం వారు స్థానిక సంస్థల ఎన్నికలకు అందరూ సిద్ధంగా ఉండాలని వారు పిలుపునివ్వడం జరిగినది తద్వారా రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రివర్యులు వై సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ బూతు స్థాయి నుంచి బిజెపి పార్టీని బలోపేతం చేయాలని కూటమి నాయకులతో సమన్వ యంగా కలిసికట్టుగా పనిచేయాలని,కష్టపడిన వాడిని పార్టీ ఎప్పుడు గుర్తిస్తుందని వారు తెలియజేయడం జరిగింది. అలాగే కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధిని ప్రజలలోకి తీసుకెళ్లాలని మంత్రివర్యులు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, వై సత్య కుమార్ యాదవ్ తెలియజేయడం జరిగినది.ఈ కార్యక్రమంలో రాయ చోటి సీనియర్ నాయకుడు అరమాటి శివగంగ రెడ్డి, మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ పాలగిరి శ్రీనివాసరాజు, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రేపన శివప్రసాద్ గారు, బిజెపి జిల్లా కార్యదర్శి నిర్మల్ కుమార్ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాలాజీ యాదవ్ గారు, టీడీపీ నాయకుడు రవీరాజు తదితరులు పాల్గొన్నారు

# మూఢనమ్మకాల నిరోధక చట్టాన్ని వెంటనే తెప్పించాలి

**- కామనురు శ్రీనివాసులురెడ్డి**



**కడప - సూర్య వాస్తవం:** కడప నగరంలోని కోటిరెడ్డి మహిళా కళాశాలలో జనవిజ్ఞాన వేదిక కడప జిల్లా శాఖ శాస్త్రీయ దృక్పద దినోత్సవం సందర్భంగా సంతకాల సేకరణ కార్యక్రమం గురువారం జరిగింది. ఈ కార్యక్రమానికి సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కామనురు శ్రీనివాసులు రెడ్డి సంతకాల సేకరణకు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ సమాజంలో వేళ్లూనుకుంటున్న మూఢనమ్మకాలను అరికట్టడానికి, ప్రజల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వెంటనే కఠినమైన 'మూఢనమ్మకాల నిరోధక చట్టం' తీసుకురావాలని డిమాండ్ చేశారు. శాస్త్ర సాంకేతిక రంగం ఎంతగానో అభివృద్ధి చెందుతున్నప్పటికీ, నేటికీ సమాజంలో కొన్నిచోట్ల మూఢ విశ్వాసాలు, అశాస్త్రీయ ఆచారాలు ప్రజల జీవితాలను, ప్రాణాలను బలిగొంటు న్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. "శాస్త్రం మనకు దారి చూపుతుంది, విజ్ఞానం మనల్ని విముక్తి చేస్తుంది, తర్కం మనకు బలం ఇస్తుంది, ప్రశ్నించు, తెలుసుకో, ముందుకు పో!" అనే నినాదంతో ప్రజలందరూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. దేశం శాస్త్రీయ ఆలోచనలతో ముందుకు దూసుకుపోవాలంటే యువతలో పౌరులలో శాస్త్రీయ భావనలు పెరగడం ఎంతైనా అవసరమని అభిప్రాయపడ్డారు. మూఢ విశ్వాసాల నిర్మూలన కోసం ప్రత్యేక చట్టం తీసుకురావాలని కోరుతూ చేపట్టిన ఈ సంతకాల సేకరణ ఉద్యమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని తెలిపారు. ప్రజాశ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి అసెంబ్లీలో మూఢనమ్మకాల నిరోధక చట్టాన్ని ఆమోదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ సభ్యులు రాజశేఖర్ రాహుల్. షేక్ కరిముల్లా సిపి రమణ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు

# పెద్దపుత్త గ్రామ వాస్తవ్యుల ఆధ్వర్యంలో మఠాధిపతికి బంగారపు ఉంగరం బహూకరణ



**బ్రహ్మంగారిమఠం- సూర్య వాస్తవం:** శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి మఠం నూతన మఠాధిపతి శ్రీ వీరధర్మజ వెంకటాద్రి స్వాములవారికి పెద్దపుత్త గ్రామ వాస్తవ్యులు బంగారపు ఉంగరాన్ని భక్తిశ్రద్ధలతో బహూకరించారు. ఈ సందర్భంగా వీరబ్రహ్మేంద్ర స్వామి మఠం ప్రాంగణంలో మఠాధిపతి శ్రీ వీరధర్మజ వెంకటాద్రి స్వాములవారి ధర్మపత్ని శ్రీమతి ఉమాదేవి అమ్మవారికి పట్టుచీర, వస్త్రాలను అందజేసి ఆశీస్సులు పొందారు. ఈ బంగారపు ఉంగరాన్ని బహూ కరించిన వారు గతంలో 1919 సంవత్సరంలో శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ ప్రాంగణంలో కళ్యాణ మండపం నిర్మాణానికి దాతలుగా నిలిచిన పెద్దపుత్త గ్రామ వాస్తవ్యులు కీర్తిశేషులు తాడిగొట్ల వీరారెడ్డి కుటుంబ సభ్యులు కావడం విశేషం. అనంతరం మఠాధిపతి శ్రీ వీరధర్మజ వెంకటాద్రి స్వాములవారు తాడిగొట్ల వీరారెడ్డి కుటుంబ సభ్యులను ఘనంగా సన్మానించి, వారి సేవలను అభినందించారు. ఈ కార్యక్రమంలో భక్తులు, మఠ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కేరళ యువకుడిని కాపాడి తల్లిదండ్రులకు అప్పగించిన అన్నమయ్య జిల్లా పోలీసులు.

**అన్నమయ్య బ్యూరో - సూర్య వాస్తవం:** కేరళ నుంచి వచ్చి మానసిక స్థితి సరిగా లేక తప్పిపోయిన అరుణ్ ఐషాక్ (27) అనే యువకుడిని అన్నమయ్య జిల్లా పోలీసులు క్షేమంగా గుర్తించి కాపాడారు. రామాపురం ఎస్ఐ ఎ.బి. శివకుమార్, రాయచోటి అర్బన్ కానిస్టేబుల్ (పీసీ2872), హోంగార్డ్ (హెచ్‌జి 725) లు నైట్ రౌండ్స్‌లో రాయచోటి పట్టణంలో గాలించి ఆ యువకుడిని రక్షించారు. స్థానిక ఉపాధ్యాయుడి సాయంతో కౌన్సిలింగ్ ఇప్పించి, సమాచారం అందుకుని రాయచోటికి చేరుకున్న తల్లిదండ్రులకు యువకుడిని సురక్షితంగా అప్పగించారు. నైట్ రౌండ్స్‌లో సమయ స్ఫూర్తితో మానవతా దృక్పథాన్ని చాటిన పోలీస్ సిబ్బందిని లిజిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి, ప్రత్యేకంగా అభినందించారు.



PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS ADDRESS : H/No C/ 33 Near Ring road Cattamanchi school opposite Kurnool ANDHRAPRADESH-518001,CELL : : 9885404140 ( ASSOCIATE EDITOR -Mohammad Shafi Ahamad 9948461699 )